teenmaardesk@gmail.com
RNI no TELTEL/2021/86151


# తీన్మార్

నేటి వాస్తవాలు... తెలుగు దిన పత్రిక

ములుగు | సంపుటి : 03 | సంచిక : 298 | ఛీఫ్ ఎడిటర్ : రెడ్డి శేఖర్ | మంగళవారం | 11 మార్చి 2025 | పేజీలు : 08 | వెల ' 5

Published from Mulugu Circulated by Warangal, Khammam, Hyderabad, Nalgonda, Mahabubnagar, Rangareddy,Medak, Karimnagar,Nizamabad, Adilabad.

## ఎమ్మెల్సీ ఎన్నికలకు ముగిసిన నామినేషన్ల గడువు



తెలంగాణ బ్యూరో, మార్చ్ 10 (తీన్మార్ న్యూస్): రెండు తెలుగు రాష్ట్రాల్లో ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికలకు నామినేషన్ల గడువు సోమవారం సాయంత్రంతో పూర్తయ్యింది. తెలంగాణలో 5 స్థానాలకు, ఏపీలో 5 స్థానాలకు గానూ ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికలకు మార్చ్ 2న నోటిఫికేషన్ విడుదల అయిన విషయం తెలిసిందే. కాగా తెలంగాణలో కాంగ్రెస్, బీఆర్ఎస్ ఎమ్మెల్యేల సంఖ్యాబలము

మిగతా 4 లో



02

## ఢిల్లీలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట చెల్లట్లే

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎద్దేవా



02

## అసెంబ్లీలో గవర్నర్ ప్రసంగానికి కేసీఆర్

పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వెల్లడి



# నిరుపేదలకే ఇందిరమ్మ ఇల్లు

### నిర్మాణం ఏ దశలో ఉన్నా అనర్హులని తేలితే ఇల్లు రద్దు

**అధికారులతో మంత్రి పొంగులేటి సమీక్ష**

**వీలైనంత సాంకేతిక పరిజ్ఞాన ఉపయోగానికి ఆదేశాలు**

తెలంగాణ రాష్ట్రంలో ఇందిరమ్మ ఇళ్లు పథకం అనేది పేద ప్రజలకు గృహాలను అందించడానికి ఉద్దేశించిన ఒక ప్రతిష్టాత్మక ప్రభుత్వ కార్యక్రమం. ఈ పథకం కింద, అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వం ఉచితంగా ఇళ్లను అందిస్తుంది. ఈ పథకం గ్రామీణ మరియు పట్టణ ప్రాంతాల్లోని పేద ప్రజలకు ఉపయోగపడుతుంది. ఈ పథకం యొక్క ముఖ్య లక్ష్యాలు పరిశీలిస్తే పేద ప్రజల సొంతింటి కలను నెరవేర్చడం, గృహ వసతి లేని వారికి ఆశ్రయం కల్పించడం, పేదరిక నిర్మూలనకు కృషి చేయడం. కాగా అర్హులైన వారికి త్వరలోనే ఇందిరమ్మ ఇళ్లను పంపిణీ చేయనున్నారు.



## దేశవ్యాప్తంగా శ్రీచైతన్య కళాశాలల్లో సోదాలు

**పెద్ద మొత్తంలో అక్రమాలు జరిగినట్టు సమాచారం**

**రాష్ట్ర ప్రభుత్వాలకు, కేంద్రానికి భారీగా ఫిర్యాదులు**




తెలంగాణ బ్యూరో, మార్చ్ 10 (తీన్మార్ న్యూస్): దేశవ్యాప్తంగా శ్రీచైతన్య కళాశాలల్లో సోదాలు జరుగుతున్నాయి. తెలంగాణ, ఏపీ, ఢిల్లీ, ముంబై, బెంగుళూరు, చెన్నైలో ఏకకాలంలో సోదాలు నిర్వహిస్తున్నారు. దేశవ్యాప్తంగా ఉన్న కాలేజీల్లో పెద్ద మొత్తంలో అక్రమాలు జరిగినట్టు అధికారులు గుర్తించినట్టు తెలుస్తోంది. కాగా నీట్, జేఈఈ వంటి

మిగతా 2 లో

## తులం బంగారం ముచ్చటేంటి..?

**15 నెలల్లో ఎంత మంది కోటీశ్వరులయ్యారో ప్రకటించాలి**

**కాంగ్రెస్ ప్రభుత్వంపై మోర్చా అధ్యక్షురాలు శిల్పా రెడ్డి ఫైర్**

తెలంగాణ బ్యూరో, మార్చి 10 (తీన్మార్ న్యూస్): తెలంగాణ బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు శిల్పా రెడ్డి మరోసారి కాంగ్రెస్ ప్రభుత్వంపై ఫైర్ అయ్యారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేస్తామని రేవంత్ రెడ్డి పదే పదే చెబుతున్నారని, 15 నెలల్లో



## కళ్ళల్లో నిప్పులు పోసుకొని అబద్ధాలు చెబుతున్నారని ఆరోపణలు

**హరీష్ రావు వ్యాఖ్యలపై మంత్రి సీతక్క తీవ్ర ఆగ్రహం**



హైదరాబాద్, మార్చ్ 10 (తీన్మార్ న్యూస్): బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీష్ రావు వ్యాఖ్యలపై మంత్రి సీతక్క తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం మధురానగర్ మహిళా శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్ కార్యాలయంలో ఆమె మీడియాతో మాట్లాడారు. పరేడ్ గ్రౌండ్లో మహిళా సభ విజయవంతమైంది. అందుకే కడుపు మంటతో కళ్ళల్లో నిప్పులు పోసుకొని హరీష్ రావు అబద్ధాలు చెబుతున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో మహిళలకు మీరేం చేయలేదనే విషయం మహిళలందరికీ తెలుసు. వడ్డీ లేని రుణాలు ఇవ్వలేదని మండిపడ్డారు. ఇప్పుడు

మిగతా 2 లో

## అఖిల పక్ష సమావేశానికి పిలిస్తే కేంద్రమంత్రి కిషన్ రెడ్డి రాలే



**కేసీఆర్ బాధపడుతారని**

**కేంద్రమంత్రి సహకరించడం లేదు**

**ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వాఖ్యలు**

హైదరాబాద్, మార్చ్ 10 (తీన్మార్ న్యూస్ ): అఖిల పక్ష సమావేశానికి పిలిస్తే కేంద్రమంత్రి కిషన్ రెడ్డి సికింద్రాబాద్‌లో ఉండి కూడా రాలేదని కేసీఆర్ బాధపడుతారని కేంద్రమంత్రి సహకరించడం లేదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. సోమవారం మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో సీఎం మాట్లాడుతూ మనోహర్ లాల్ కట్టర్ వచ్చేది కూడా కిషన్ రెడ్డికి తెలియదా అని ప్రశ్నించారు. రీజనల్ రింగ్ రోడ్డు ఇచ్చామని మోడీ అన్నారని అదే

మిగతా 2 లో



## ఛాంపియన్స్ ట్రోఫీ ముగియడంతో కన్ను ఐపీఎల్‌పై

**మార్చి 22వ తేదీ నుంచి ప్రారంభంకానున్న సీజన్**

న్యూ ఢిల్లీ, మార్చ్ 10 (తీన్మార్ న్యూస్): నెలరోజుల పాటు క్రికెట్ అభిమానులను ఎంతో అలరించిన ఛాంపియన్స్ ట్రోఫీ ముగిసింది. దుబాయ్ వేదికగా జరిగిన మ్యాచ్‌లో టీమిండియా సెన్సేషనల్ విక్టరీ సాధించింది. గతేడాది టీ20 ప్రపంచ కప్‌ను గెలుచుకున్న భారత్. తొమ్మిది నెలల వ్యవధిలోనే మరో ఐసీసీ ట్రోఫీ(ఛాంపియన్స్ ట్రోఫీ)ని దక్కించుకుంది. దీంతో ప్రపంచ

మిగతా 2 లో

## ప్రణయ్ హత్య కేసులో ఏ2కి ఉరి శిక్ష

**ఆరుగురికి జీవిత ఖైదు విధించిన కోర్టు**

**78 మంది సాక్షులను విచారించిన న్యాయస్థానం**

02

**కులాంతర వివాహమే కారణంగానే హత్య.. నిర్ధారించిన కోర్టు**



## సామాజిక న్యాయానికి కేరాఫ్ అడ్రస్ కాంగ్రెస్ పార్టీ

**టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్**

**ఎమ్మెల్సీ ఎన్నికకు కాంగ్రెస్ అధిష్టానం ఫామ్ ల అందజేత**

హైదరాబాద్, మార్చ్ 10 (తీన్మార్ న్యూస్): సామాజిక న్యాయానికి కేరాఫ్ అడ్రస్ కాంగ్రెస్ పార్టీ అని టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికకు కాంగ్రెస్ అధిష్టానం ఎంపిక చేసిన పార్టీ అభ్యర్థులకు ఫామ్ లు అందజేశారు. ఈ కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి సహా



మిగతా 2 లో




## నోటిఫికేషన్లకు ఎస్సీ వర్గీకరణ వర్తింప జేయాలని డిమాండ్

**ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ**

04



## గ్రూప్-1 ఫలితాలను విడుదల చేసిన పబ్లిక్ సర్వీస్ కమిషన్

తెలంగాణ బ్యూరో, మార్చ్ 10 (తీన్మార్ న్యూస్): తెలంగాణ గ్రూప్-1 ఫలితాలను తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ సోమవారం విడుదల చేసింది. మొత్తం 563 పోస్టుల భర్తీకి నిర్వహించిన ప్రధాన పరీక్షల్లో అభ్యర్థుల ప్రాథమిక మార్కుల

మిగతా 2 లో

# నిరుపేదలకే ఇందిరమ్మ ఇల్లు

తెలంగాణ బ్యూరో, మార్చి 10 (తీన్మార్ న్యూస్): జనవరి మూడో వారంలో నిర్వహించిన గ్రామసభల్లో ఇందిరమ్మ ఇండ్ల కోసం వచ్చిన దరఖాస్తులను వెంటనే పరిశీలించి లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ చేపట్టాలని రెవెన్యూ, హౌసింగ్, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం సచివాలయంలో ఇందిరమ్మ ఇండ్లపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ జనవరి 26న లబ్ధిదారులను ఎంపిక చేసిన 562 గ్రామాల్లో ఎదురైన పరిస్థితులు, మంచి చెడులను పరిగణనలోకి తీసుకొని ఎంపిక ప్రక్రియ చేపట్టాలని సూచించారు. నిరుపేదలకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. వీలైనంత మేరకు సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకొని అర్హులకే లభించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం ఏ దశలో ఉన్నా అనర్హులని తేలితే వాటిని రద్దు చేస్తామని ప్రకటించారు. అర్హులైన ప్రతిఒక్కరికీ ఇందిరమ్మ ఇండ్లు నిర్మించి ఇవ్వడమే ఈ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇందిరమ్మ ఇండ్ల కోసం నిరుపేదలు ఎదురుచూస్తున్నారని, వారి ఆశలకు అనుగుణంగా అధికారులు పనిచేయాలని సూచించారు. ఈ సమావేశంలో హౌసింగ్ స్పెషల్ సెక్రెటరీ జ్యోతి బుద్దా ప్రకాశ్, హౌసింగ్ కార్పొరేషన్ ఎండీ వీపీ గౌతమ్ పాల్గొన్నారు.



## తులం బంగారం ముచ్చటేంటి..?

మొదటి పేజీ తరువాయి


ఎంత మందిని కోటీశ్వరులను చేశారో వెంటనే ప్రకటించాలని శిల్పారెడ్డి డిమాండ్ చేశారు. రేవంత్ రెడ్డికి ముఖ్యమంత్రిగా కొనసాగే అర్హత లేదని తెలంగాణ మహిళలు భావిస్తున్నారని విమర్శించారు. మహిళా సాధికారతకు కట్టుబడి ఉంది బీజేపీ మాత్రమేనని, మహిళలను కేంద్ర రక్షణ, ఆర్థిక మంత్రులను, ముఖ్యమంత్రులను చేసింది తమ పార్టీనే అని అన్నారు. కాంగ్రెస్ పార్టీకి మహిళలు అంటే ఇందిరా గాంధీ, సోనియా గాంధీ, ప్రియాంక గాంధీ మాత్రమేనని రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డిని అన్నగా భావిస్తే కడుపుకోతే మిగులుతుంది. తులం బంగారం ఇస్తామని చెప్పి బెల్టు షాపులు తెరిచారుని, బెల్టు షాపుల పేరుతో అనేక మంది తాళి బొట్లు తెంపుతున్న ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిది అని మండిపడ్డారు. కోటి మంది మహిళలను కోటీశ్వర్లను చేస్తామన్న ముఖ్యమంత్రి ఒక్క మహిళనైనా పారిశ్రామిక వేత్తను చేశారా అని ప్రశ్నించారు. 600 బస్సులు ఇస్తామని చెప్పి కేవలం 20 బస్సులే ఇచ్చారని, ఎన్నికల్లో ఇచ్చిన హామీ మహిళలకు రూ. 2500 కూడా నెరవేర్చలేదుని.. ప్రతి విషయంలో ప్రభుత్వం మహిళలను మోసం చేస్తూనే వస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

## ఛాంపియన్స్ ట్రోఫీ ముగియడంతో కన్ను ఐపీఎల్‌పై

మొదటి పేజీ తరువాయి

వ్యాప్తంగా భారతీయులు సంబురాలు జరుపుకున్నారు. ఛాంపియన్స్ ట్రోఫీ ముగియడంతో ఇక అందరి కన్ను ఐపీఎల్‌పై పడింది. మార్చి 22వ తేదీ నుంచి సీజన్ ప్రారంభం కాబోతోంది. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం సంచలన నిర్ణయం తీసుకున్నది. ప్రభుత్వం నిషేధించిన వాటితో పాటు పొగాకు, మద్యం ప్రకటనలను నిషేధించాలని కోరుతూ కేంద్ర ఆరోగ్యశాఖ బీసీసీఐ తో పాటు ఐపీఎల్ చైర్మన్ కు లేఖ రాసింది. ఆ యాడ్స్ తోపాటు క్రీడాకారులు, కామెంటేటర్లు కూడా ప్రమోట్ చేయడానికి వీళ్లేద్దని లేఖలో పేర్కొంది. ఐపీఎల్‌ను యూత్ ఎక్కువగా చూస్తుండటంతో పొగాకు, మద్యం యాడ్స్ ప్రభావం వారిపై పడే అవకాశం ఉందని అందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆరోగ్యశాఖ రాసిన లేఖలో పేర్కొన్నది. కాగా, ఈ ఐపీఎల్‌లో తొలి మ్యాచ్ మార్చి 22న ఆర్సీబీ, కేకేఆర్ మధ్య జర-ుబోతుండగా, మార్చి 23న రెండో మ్యాచ్ సన్ రైజర్స్ హైదరాబాద్ వర్సెస్ రాజస్థాన్ రాయల్స్ మధ్య జరుగనుంది.

## గ్రూప్-1 ఫలితాలను విడుదల చేసిన పబ్లిక్ సర్వీస్ కమిషన్



మొదటి పేజీ తరువాయి

వివరాలను వెల్లడించింది. అలాగే, గ్రూప్-2 అభ్యర్థుల జనరల్ ర్యాంకింగ్ జాబితా మార్చి 11న, గ్రూప్- 3 పరీక్ష జనరల్ ర్యాంకింగ్ జాబితాను మార్చి 14న విడుదల టీజీపీఎస్సీ విడుదల చేయనుంది.

ఇక టీజీపీఎస్సీ ప్రకటించిన ప్రాథమిక జాబితాలో వచ్చిన మార్కులపై సందేహాలున్న అభ్యర్థులు 15 రోజుల్లోగా ఒక్కో పేపర్‌కు రూ. 1000 చొప్పున చెల్లించి రీ కౌంటింగ్‌కు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. అభ్యర్థుల నుంచి రీకౌంటింగ్‌పై అభ్యంతరాలు స్వీకరించి, ఆ ప్రక్రియ ముగిసిన వెంటనే 1:2 నిష్పత్తిలో తుది జాబితాను రిలీజ్ చేయనుంది. కాగా, గత ఏడాది అక్టోబర్ 21 నుంచి 27 వరకూ గ్రూప్-1 మెయిన్ పరీక్షలు జరిగాయి. గ్రూప్-1 ప్రిలిమ్స్‌లో 31,383 మంది క్వాలిఫై అయినప్పటికీ మెయిన్స్ పరీక్షలకు మాత్రం 21,093 మంది హాజరయ్యారు. అలాగే, గ్రూప్-1 ఫలితాల విడుదలలో అనేక న్యాపరమైన సమస్యలు ఎదురైన సంగతి తెలిసిందే. ఎట్టకేలకు నెల క్రితం దాఖలైన రెండు పిటిషన్లను సుప్రీం కోర్టు కొట్టివేయడంతో ఫలితాల విడుదలకు గ్రీన్ సిగ్నల్ లభించింది. గతంలో కొంతమంది అభ్యర్థులు తెలంగాణ హైకోర్టును ఆశ్రయించగా వారి పిటిషన్లు న్యాయస్థానం కొట్టివేసింది. అనంతరం వారు సుప్రీం కోర్టును ఆశ్రయించగా, తెలంగాణ ప్రభుత్వ వాదనలతో ఏకీభవించిన ధర్మాసనం ఆ పిటిషన్లను కొట్టివేసింది. ఫలితాల కోసం వెబ్‌సైట్ %ష్ట్రజూం://షషష్.ంజూంఎ.స్త్రశీఙ.అఅ%/ ను సందర్శించండి.

## సామాజిక న్యాయానికి కేరాఫ్ అడ్రస్ కాంగ్రెస్ పార్టీ

మొదటి పేజీ తరువాయి

మంత్రులు ఇతర కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ ఎమ్మెల్సీ అభ్యర్థుల ఎంపికపై పలు ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ మూల సిద్ధాంతంలోనే సామాజిక న్యాయం ఉన్నదని తెలిపారు. కాంగ్రెస్ తోనే కులగణన, ఎస్సీ వర్గీకరణ సాధ్యమైందని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ రెడ్డిని సీఎం చేస్తే టీపీసీసీ అధ్యక్ష పదవి బీసీకి ఇచ్చారని తెలిపారు. అలాగే ఇప్పుడు మూడు ఎమ్మెల్సీ స్థానాలను ఎస్సీ, ఎస్టీ, బీసీ మహిళకు ఇచ్చిందని తెలియజేశారు. కాంగ్రెస్ పార్టీలో ఎవరికైనా అవకాశాలు దక్కుతాయని, ఏ అవకాశం అయినా ఎస్సీ, ఎస్టీ, బీసీలకు ప్రాధాన్యం ఉంటుందని టీపీసీసీ చీఫ్ స్పష్టం చేశారు. కాగా తెలంగాణలో ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికల కోసం ఏఐసీసీ ఆదివారం అభ్యర్థుల జాబితాను విడుదల చేసింది. కాంగ్రెస్ పార్టీ నుంచి ముగ్గురికి అవకాశం దక్కగా మరొకటి మిత్రపక్షమైన సీపీఐ కేటాయించింది. దీంతో కాంగ్రెస్ పార్టీ ఎంపిక చేసిన అద్దంకి దయాకర్, కేతావత్ శంకర్ నాయక్, విజయశాంతి లు సోమవారం బీ ఫామ్ అందుకొని, నామినేషన్ పత్రాలు దాఖలు చేశారు.

## కళ్ళల్లో నిప్పులు పోసుకొని అబద్ధాలు చెబుతున్నారని ఆరోపణలు

మొదటి పేజీ తరువాయి

కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు చేస్తున్న మంచిని చూసి ఓర్వలేక రాష్ట్రంలో మహిళలు అప్పుల పాలు అవుతున్నారని హరీష్ రావు మొసలి కన్నీరు కారుస్తున్నారని ఎద్దేవా చేశారు. మహిళా సంక్షేమం పట్ల మీది దరిద్రమైన పాలన అని సీతక్క ఘాటు వ్యాఖ్యలు చేశారు. బీఆర్ఎస్ పాలనలో కల్వకుంట్ల కవిత తప్ప ఎవరూ ఎదగలేదు. బతుకమ్మ వేడుకలు అయినా, బీసీ ఉద్యమం అయినా, మహిళా ఉద్యమమైనా కవితను ఒక్కదానినే ముందుంచారు అని గుర్తుచేశారు. అందుకే లక్ష మంది తరలివచ్చి మహిళా సభను సక్సెస్ చేస్తే మీరు ఓర్వ లేకపోతున్నారని విమర్శించారు. మీరు ఐదు సంవత్సరాలలో మహిళా సంఘాలకు రూ.3485 కోట్లు చెల్లించాల్సి ఉండగా కేవలం రూ.409 కోట్లు మాత్రమే చెల్లించారు. హరీష్ రావు ఆర్థిక మంత్రిగా చివరి మూడేళ్లలో మహిళా సంఘాల వడ్డీల కోసం నయా పైస చెల్లించలేదు. మహిళలకు మూడేళ్లు గుండు సున్నా పెట్టి పోయారు. వేల కోట్ల వడ్డీలు చెల్లించకుండా మహిళలను మోసం చేశారు. ఆడబిడ్డలు రూపాయి రూపాయి పోగేసుకున్న అభయహస్తం డబ్బులను దిగమింగిన చరిత్ర మీది మేము అధికారంలోకి వచ్చిన తర్వాత గత ఆర్థిక సంవత్సరానికి సంబంధించి మహిళలకు పూర్తి స్థాయిలో వడ్డీలు చెల్లించాము. ఈ ఏడాదికి సంబంధించి వడ్డీలు మహిళలకు చెల్లించే ప్రక్రియ కొనసాగుతోంది. ప్రమాదవశాత్తు మహిళా సంగం సభ్యురాలు మరణిస్తే ప్రమాద బీమా ఇవ్వాలన్న ఆలోచన మీరు చేయలేదు' అని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. కానీ తాము మహిళా సంఘాల మీద భారం పడకుండా ప్రతీ సభ్యురాలి కుటుంబం మీద పది లక్షల రూపాయల ప్రమాద బీమా చెల్లిస్తున్నామని చెప్పారు. ఇప్పటికే 400



మంది మహిళలకు రూ.40 కోట్లకు పైగా చెల్లిస్తున్నామని తెలిపారు. మహిళా సంఘాల పట్ల ఇది మా చిత్తశుద్ధి అని చెప్పారు. అబద్దాలకు బ్రాండ్ అంబాసిడర్‌గా హరీష్ రావు వ్యవరిస్తున్నారని విమర్శించారు. అసెంబ్లీ వేదికగా మీ బండారాన్ని బయటపెడతామని సీతక్క సంచలన ప్రకటన చేశారు. ఎవరు మహిళా సంక్షేమం కోసం ఎంత చేశారో అక్కడే తేల్చుకుందామని సవాల్ చేశారు.

## అఖిల పక్ష సమావేశానికి పిలిస్తే కేంద్రమంత్రి కిషన్ రెడ్డి రాలే



మొదటి పేజీ తరువాయి

ఇవ్వమని అంటున్నామన్నారు. జైపాల్ రెడ్డి తెచ్చిన మెట్రో కనిపిస్తోందని కిషన్ రెడ్డి తెచ్చిన మెట్రో ఎక్కడుందని ప్రశ్నించారు.

### గండపిండేరం తొడుగుతాం

భూసేకరణ అడ్డుకుంటుంది ఈటల, లక్ష్మణ్ అని ఆరోపించారు. ప్రాజెక్టులు ముందుకు వెళ్ళకుండా అడ్డుకుంటుంది రాష్ట్ర బీజేపీ నేతలే అని మండిపడ్డారు. మూసీకి నిధులు తెస్తే కిషన్ రెడ్డికి సన్మానం చేసి గండపిండేరం తొడుగుతానన్నారు. సబర్మతి, యమునా, గంగా ప్రక్షాళనకు నిధులు ఇస్తున్న కేంద్రం మూసీకి ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. 39 సార్లు కాదు 99 సార్లు ఢిల్లీకి వెళ్తానని సీఎం తెలిపారు. ఢిల్లీకి వెళ్లిన ప్రతిసారి రాష్ట్రానికి కావల్సినవి తెచ్చుకుంటానన్నారు. రాష్ట్రానికి కావాల్సిన అనేక అంశాలను క్లియర్ చేసుకొని వచ్చినట్లు తెలిపారు. కుల గణన ప్రభావమే అన్ని పార్టీలు బీసీలకు టికెట్లు ఇచ్చాయన్నారు. హరీష్ రావు మోసం వల్లే గ్రాడ్యుయేట్ ఎన్నికల్లో ఓడిపోయామని విమర్శించారు.

### కేసీఆర్‌కు బలుపు

నేను రాష్ట్ర ముఖ్యమంత్రిని. కేసీఆర్‌ను ఓడించింది నేను. కేసీఆర్‌ను గుండుసున్నా చేసింది నేను. కేసీఆర్‌ను బండకేసి కొట్టింది నేను. అడ్డగోలుగా మాట్లాడడంలో కేసీఆర్‌కు మించినవాళ్ళు ఎవరున్నారు.కేటీఆర్ స్థాయి ఏంటి. కేసీఆర్‌కు బలుపు తప్ప ఏముంది. తండ్రీ కొడుకులకు బలుపు తప్పా ఏముంది.అసెంబ్లీలో అధికారపక్షం కంటే ప్రతిపక్షానికి ఎక్కువ సమయం ఇస్తున్నాం" అని ముఖ్యమంత్రి అన్నారు. ప్రతిపక్షం లేని రాజకీయాలు చేయాలని తాము అనుకోవడం లేదన్నారు. వాళ్ళు మూసేసిన ధర్నా చౌక్ మేం తెరిచామన్నారు. విమర్శలు చేస్తే పరిశీలించుకుంటామని సలహాలు ఇస్తే తప్పకుండా స్వీకరిస్తామని వెల్లడించారు. ఎస్ఎల్‌బీసీ టన్నెల్ వీలైనంత త్వరగా పూర్తి చేస్తామన్నారు.

### అది తప్ప ఏం చేయలేదు.

జీతభత్యాలు తీసుకొని పని చేయని వ్యక్తి కేసీఆర్ అని అన్నారు. పార్టీ నిర్ణయాలు ప్రెసిడెంట్ తీసుకుంటారని అభ్యర్థుల ఎంపిక విషయంలో పూర్తి స్వేచ్ఛ పార్టీ అధ్యక్షుడికి ఉంటుందని తెలిపారు. పదేండ్లలో అప్పులు, తప్పులు తప్పా కేసీఆర్ ఏం చేయలేదన్నారు. అప్పుల విషయంలో కేసీఆర్ తప్పుడు లెక్కలు చూపెట్టారని దుయ్యబట్టారు. కేసీఆర్ చేసిన అప్పులు, తప్పులు కాగ్ రిపోర్ట్ అసెంబ్లీలో బయట పెడుతామన్నారు. కేసీఆర్, కేటీఆర్, హరీష్ రావు దుర్మార్గులని మండిపడ్డారు. తెలంగాణలో శవాలు లేస్తున్నాయని తెలియగానే తీన్మార్ డాన్సులు చేస్తున్నారని పంటలు ఎండితే ప్రతిపక్షాలు సంతోషపడుతున్నాయని విమర్శించారు. ప్రజలు ఇబ్బందులు పడితే బాధపడాలని ఇంత దుర్మార్గులు ప్రపంచంలో ఎవరైనా ఉంటారా అని అన్నారు. రోజమ్మ పెట్టిన రొయ్యల పులుసు తిన్నది ఎవరని ప్రశ్నించారు. కేసీఆర్ ప్రాజెక్టులు పూర్తి చేస్తే ఈ తలనొప్పులు ఉండకపోయేదన్నారు. ప్రగతి భవన్‌కు పిలిచి పంచభక్ష పరమాన్నాలు పెట్టింది ఎవరన్నారు. కరువు వస్తే ఇంత పంట పండుతుందా అని అన్నారు.

## ఢిల్లీలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట చెల్లట్లే

హైదరాబాద్, మార్చి 10 (తీన్మార్ న్యూస్): తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట ఢిల్లీలో చెల్లుబాటు కావడం లేదని ఎద్దేవా చేశారు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్. రేవంత్‌ను చూసి తెలంగాణ ప్రజలు జాలి పడాలన్నారు. అలాగే, ఈసారి అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలకు ప్రతిపక్ష నేత కేసీఆర్ హాజరవుతారని తెలిపారు. ఎమ్మెల్సీ కోటాలో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థి దాసోజు శ్రవణ్ నేడు నామినేషన్ దాఖలు చేశారు. ఈ క్రమంలో సోమవారం అసెంబ్లీకి కేటీఆర్ వచ్చారు. నామినేషన్ సందర్భంగా కేటీఆర్ మీడియాతో మాట్లాడుతూ శ్రవణ్‌ను 2023లోనే ఎమ్మెల్సీగా కేసీఆర్ నామినేట్ చేశారు. అప్పుడు బీజేపీ ఉద్దేశ్యపూర్వకంగా అడ్డుకుంది. శ్రవణ్ బీఆర్ఎస్‌ను వదిలిపెట్టి వెళ్లి ఉంటే ఇప్పటికే చట్ట సభల్లో అడుగుపెట్టేవాడు. కానీ, బీఆర్ఎస్‌పై నమ్మకంతో పార్టీలోనే ఉన్నాడు. రెండు జాతీయ పార్టీలదీ ఒకటే ధోరణి. రాష్ట్రాలపై పెత్తనం చెలాయిస్తున్నాయి. రేవంత్ రెడ్డి చుట్టూ ఉండే నలుగురు బ్రోకర్లు టీడీఆర్ ల్యాండ్ కొనే పనిలో తిరుగుతున్నారు. టీడీఆర్ అతి పెద్ద కుంభకోణానికి తెరలేపబోతున్నారు. రేవంత్ ఇన్‌సైడ్ ట్రేడింగ్ చేస్తున్నారు. ఎఫ్ఎస్ఐ నిబంధనల ద్వారా శిఖం భూముల ధరలు కృత్రిమంగా పెంచే యోచనలో రేవంత్ ఉన్నారు. తెలంగాణలో రేవంత్ అండ్ టీమ్ ప్రైవేటు దోపిడీ పెరుగుతోంది. ప్రభుత్వ ఆదాయం తగ్గుతోంది. ప్రభుత్వం లేని అప్పులు చూపించి ఎక్కువ మిత్తి చూపిస్తున్నారు. కేంద్రంతో మంచి సంబంధం ఉన్న రేవంత్ తెలంగాణకు ఎన్ని నిధులు తెచ్చాడో చెప్పాలి. 15 నెలల్లో కాంగ్రెస్ ప్రభుత్వం బీజేపీ ఒక్క పోరాటమైనా చేసిందా.. బీజేపీ హడావుడి సోషల్ మీడియాలో ఎక్కువ.. సొసైటీలో తక్కువ అంటూ సెటైర్లు వేశారు. తెలంగాణలో కాంగ్రెస్ సర్కార్ బడ్జెట్ అట్టర్ ఫ్లాప్‌గా ఉంది. అందుకే అటెన్షన్ కోసం డైవర్షన్ రాజకీయం చేస్తున్నారు. ఈ-కారు రేసును ముందుకు తెచ్చారు. ప్రపంచ సుందరి పోటీలు పెట్టి సీఎం ఏం సాధిస్తారు.. 200 కోట్లు ఖర్చు పెట్టారు ఏం లాభం వస్తుంది.. ఎవరికి ఉద్యోగాలు వస్తాయి అని ప్రశ్నించారు.

## అసెంబ్లీలో గవర్నర్ ప్రసంగానికి హాజరుకానున్న కేసీఆర్

హైదరాబాద్, మార్చి 10 (తీన్మార్ న్యూస్): అసెంబ్లీలో కేసీఆర్ ప్రసంగం కోసం ఎదురు చూసే వారికి శుభవార్తే ఇది. తెలంగాణ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలకు బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు హాజరవుతారని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు చెప్పారు. అసెంబ్లీ సమావేశాల తొలి రోజున గవర్నర్ ప్రసంగానికి కేసీఆర్ హాజరవుతారని తెలిపారు. బడ్జెట్ ప్రసంగంలోనూ కేసీఆర్ పాల్గొంటారని కేటీఆర్ వెల్లడించారు. ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ అభ్యర్థిగా దాసోజు శ్రవణ్ ఇవాళ నామినేషన్ దాఖలు చేశారు. ఈ కార్యక్రమానికి హాజరైన కేటీఆర్.. మీడియాతో చిట్‌చాట్‌లో పాల్గొన్నారు. మార్చి 12 నుంచి జరగబోయే అసెంబ్లీ సమావేశాలకు కేసీఆర్ హాజరవుతారని కేటీఆర్ చెప్పారు. ఆ తర్వాత కొన్ని కార్యక్రమాలకు కూడా కేసీఆర్ వస్తారని స్పష్టం చేశారు. కానీ కేసీఆర్ అసెంబ్లీ సమావేశాలకు హాజరుకాకపోవడమే మంచిదని ఒక కొడుకుగా తన అభిప్రాయమని చెప్పారు కేటీఆర్. కేసీఆర్ స్థాయికి కాంగ్రెస్‌లో ఎవరూ సరిపోరని ఆయన అన్నారు. వాళ్ల పిచ్చి మాటలు, పనికిమాలిన దూషణలు, కారుకూతలు వినడానికి కేసీఆర్ రావద్దనేది కొడుకుగా తన అభిప్రాయమని కేటీఆర్ వివరించారు. బీఆర్ఎస్ నిర్వహించబోయే భారీ బహిరంగ సభకు వరంగల్ అనువైన ప్రాంతమని కేటీఆర్ చెప్పారు. అన్ని రకాల రవాణా సదుపాయం ఉందని అన్నారు. ప్లీనరీ విషయంలో ఇంకా నిర్ణయం తీసుకోలేదని, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ త్వరలోనే నిర్ణయం తీసుకోవచ్చని స్పష్టం చేశారు. ఎండలు ఎక్కువగా ఉన్నందున రెండు సభలు పెడితే ఇబ్బంది అని భావించామని అన్నారు.

## దేశవ్యాప్తంగా శ్రీచైతన్య కళాశాలల్లో సోదాలు




మొదటి పేజీ తరువాయి

పరీక్షల కోసం ఎంతో మంది తల్లిదండ్రులు తమ పిల్లలను ఈ కళాశాలలో జాయిన్ చేస్తూ ఉంటారు. అయితే గత కొంతకాలంగా ఈ కళాశాలల్లో విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడుతుండటం, అధికంగా ఫీజులు వసూలు చేస్తుండటంతో పలువురు తల్లిదండ్రులు ఆయా రాష్ట్ర ప్రభుత్వాలకు, కేంద్రానికి భారీగా ఫిర్యాదులు చేశారు. దీంతో రంగంలోకి దిగిన ఐటీ అధికారులు ఏకకాలంలో దేశంలోని పలు నగరాలలో ఉన్న ఈ కాలేజీలపై దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో విద్యార్థుల నుంచి నగదు రూపంలో డబ్బులు తీసుకొని ప్రభుత్వానికి టాక్స్ ఎగవేస్తున్నట్టు తేల్చారు. విద్యార్థుల కోసం ప్రత్యేకంగా సాఫ్ట్ వేర్ తయారు చేసుకుని, ప్రభుత్వానికి కట్టే ట్యాక్స్ మరొక సాఫ్ట్ వేర్ ఏర్పాటు చేసుకున్నట్లు ఐటీ అధికారులు చెబుతున్నారు. ఆదాయపు పన్ను అవకతవకలపై ఆరా తీస్తున్నట్లు సమాచారం. అదేవిధంగా పలు కాలేజీలకు అనుమతులు లేవని, హాస్టల్ భవనాలకు అనుమతులు లేకుండానే నిర్వహిస్తున్నారని తేలింది. అలాగే పరిమితికి మించి విద్యార్థులకు అడ్మిషన్లు తీసుకుంటున్నారని అధికారులు గుర్తించారు.

## ప్రణయ్ హత్య కేసులో ఏ2కి ఉరి శిక్ష

నల్గొండ, మార్చ్ 10 (తీన్మార్ న్యూస్): దేశ వ్యాప్తంగా సంచలనం సృష్టించిన ప్రణయ్ హత్య కేసులో నల్గొండ ఎస్సీ, ఎస్టీ కోర్టు తీర్పు వెల్లడించింది. ఈ కేసులో ఏ1గా ఉన్న అమృత తండ్రి మారుతీరావు చనిపోవటంతో ఏ2గా ఉన్న సుభాష్ శర్మకు ఉరి శిక్ష విధించింది కోర్టు. మొత్తం ఎనిమిది మందిని దోషులుగా నిర్ధారించిన కోర్టు. సుభాష్ శర్మకు మరణ శిక్ష విధించగా మిగతా ఆరుగురికి జీవిత ఖైదు విధించింది కోర్టు. మొత్తం 78 మంది సాక్షులను విచారించిన న్యాయస్థానం అమృతను కులాంతర వివాహం చేసుకున్నాడన్న కారణంగానే ప్రణయ్ ను హత్య చేసినట్లు నిర్ధారించింది కోర్టు. అమృత తండ్రి మారుతీరావు సుపారీ ఇచ్చి ప్రణయ్ ను హత్య చేయించినట్లు కోర్టు స్పష్టం చేసింది. ఈ కేసులో ఏ2గా ఉన్న సుభాష్ శర్మకు ఉరి శిక్ష .. మిగతా నిందితులు %ూ%1 మారుతీ రావు ఆత్మహత్య చేసుకోగా %ూ%3 అస్గర్ ,%ూ%4 భారీ, %ూ%5 కరీం, %ూ%6 శ్రావణ్, %ూ% 7 శివ, %ూ%8 నిజాం జీవిత ఖైదీ నిందితులకు జీవిత ఖైదు విధించింది నల్గొండ కోర్టు. తన కుమార్తె అమృత కులాంతర వివాహం చేసుసుకుందన్న కోపంతో అమృత తండ్రి మారుతీరావు సుపారీ గ్యాంగ్‌తో 2018 సెప్టెంబరు 14న ప్రణయ్‌ని హత్యచేయించాడు. ఈ కేసును ప్రతిష్టాత్మకంగా తీసుకున్న పోలీసు శాఖ అన్ని కోణాల్లో విచారణ పూర్తిచేసి 1600 పేజీల్లో చార్జ్‌షీట్‌ను రూపొందించింది.

అప్పటి ఎస్పీ ఏవీ రంగనాథ్ పర్యవేక్షణలో విచారణ పూర్తిచేసి హత్య కేసులో ఎనిమిది మంది నిందితుల పాత్ర ఉందని నిర్ధారించారు. 2019 జూన్12న చార్జ్‌షీట్ దాఖలు చేశారు. దానిపై ఎస్సీ, ఎస్టీ జిల్లా సెషన్ కోర్టు విచారణ మొదలుపెట్టింది. సుమారు ఐదు సంవత్సరాల 9 నెలల కాలం పాటు విచారణ కొనసాగగా.. పోలీస్ శాఖ సమర్పించిన చార్జ్‌షీట్, పోస్టుమార్టం రిపోర్టు, సైంటిఫిక్ ఎవిడెన్స్‌లతోపాటు సాక్షులను న్యాయస్థానం విచారించి మార్చి 10న తుది తీర్పునిచ్చింది. ప్రణయ్ హత్యకేసులో ఏ1 తిరునగరు మారుతీరావు, ఏ2 బిహార్‌కు చెందిన సుభాష్ శర్మ, ఏ3 అజ్గర్‌అలీ, ఏ4 అబ్దుల్‌బారీ, ఏ5 ఎంఏ కరీం, ఏ6 తిరునగరు శ్రవణ్ కుమార్, ఏ7 శివ, ఏ8 నిజాం నిందితులుగా పోలీసులు కోర్టుకు సమర్పించిన చార్జ్‌షీట్‌లో పేర్కొన్నారు. ప్రధాన నిందితుడు మారుతీ రావు(ఏ-1) 2020 మార్చిలో ఆత్మహత్య చేసుకున్నాడు. సుభాష్ శర్మ (ఏ-2), అస్గర్ అలీ(ఏ-3) విచారణ ఖైదీలుగా ఉ న్నారు. మిగిలిన ఐదుగురు నిందితులు బెయిల్‌పై విడుదలై కోర్టు విచారణకు హాజరవుతున్నారు. సోమవారం ఈ కేసులో కోర్టు తుది తీర్పునిచ్చింది

## మహిళా సాధికారతకు నిలువెత్తు రూపం సావిత్రిబాయి పూలే

**డెమోక్రటిక్ స్టూడెంట్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో పూలే వర్ధంతి**



మహబూబాబాద్, మార్చి 10 (తీన్మార్ న్యూస్): మనదేశంలో మొదటి మహిళా ఉపాధ్యాయురాలు మహిళలకు మొదటిపాఠశాల స్థాపించిన, సంఘ సంస్కర్త సావిత్రీబాయి పూలే అని, సమాజంలో మహిళా విద్య పట్ల వ్యతిరేకత ఉన్న కాలంలో తొలి భారతీయ మహిళా ఉపాధ్యాయురాలిగా ఎదిగిన గొప్ప మహిళ సావిత్రిబాయి పూలే అని కొనియాడుతూ మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో డిఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో వర్ధంతి సందర్భంగా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించడం జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర నాయకులు సాయి కుమార్, సూర్య ప్రకాష్ లు మాట్లాడుతూ అట్టడుగు వర్గాలు, మహిళలకు చదువు, సంపద వంటి సమస్త హక్కులు నిరాకరింపబడిన దేశంలో ఆనాటి సమాజపు కట్టుబాట్లను, మనువాద సంప్రదాయాలను, ఆధిపత్యవర్గాలను ధిక్కరించి భారతదేశపు మొట్టమొదటి ఉపాధ్యాయురాలుగా పాఠశాలలు ప్రారంభించి సమాజంలో ఎన్ని అవమానాలు ఎదురైనా మడమ తిప్పని ధీశాలి ఆమెను ఆదర్శంగా తీసుకోవాలి అని తెలిపారు. భారతదేశ చరిత్రలోనే సామాజిక విప్లవకారుడిగా ఘనతకెక్కిన జ్యోతిబా పూలే సతీమణే "సావిత్రిబాయి పూలే" కులమతాల పేరుతో తరతరాలుగా అణచివేతకు గురైన నిమ్నజాతి ప్రజలకు ఆత్మస్థైర్యం కల్పించి, వారి హక్కుల కోసం పోరాడిన మహనీయుడు మహాత్మ జ్యోతిభాపూలే అర్ధాంగి ఆమె. భర్తకు తగ్గ భార్యగా సావిత్రి కూడా ఎన్నో ఉద్యమాల్లో పాల్గొన్నారు. భారతదేశంలో మహిళా విద్యకు పెద్దపీట వేస్తూ, ముఖ్యంగా అట్టడుగు వర్గాలకు చెందిన స్త్రీలు చదువు కొనేందుకు ఆమె పాఠశాలలు సైతం ప్రారంభించారు. విద్యార్థినిలు కూడా సావిత్రిబాయి పూలే ను ఆదర్శంగా తీసుకొని ఉన్నత చదువులు చదివి అన్ని రంగాల్లో రాణించాలని కోరుతున్నాను. సమాజంలో తల్లిదండ్రులు బాల్యవివాహాలను జరిపించ కుండా తమ పిల్లలను మంచి చదువులు చదివేలా ప్రోత్సహించాలి. దేశంలో ఆడపిల్లలపై జరుగుతున్న అత్యాచారాలను అరికట్టేలా ప్రభుత్వాలు కూడా కఠినమైన చట్టాలు తీసుకురావాలి, అమలు చేయాలి. సావిత్రి బాయి పూలే ఆశయాలను కొనసాగిద్దాం. క్రాంతి బాయిగా ప్రజలందరూ పిలుచుకునే శ్రీమతి కీ.శే. సావిత్రి బాయి పూలే గారి జయంతి సందర్భంగా నేడు వర్ధంతి సందర్భంగా ఆమెకు ఘనంగా నివాళులు అర్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో డిఎస్ఎఫ్ఐ నాయకులు అజ్మీరా వీరన్న,తరుణ్,అరుణ,లావణ్య,వెన్నెల,గాయత్రి విద్యార్థినులు పాల్గొన్నారు.

## గవర్నర్ పర్యటనకు ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలి

**జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్**





ములుగు జిల్లా, మార్చి 10 (తీన్మార్ న్యూస్): తెలంగాణ రాష్ట్ర గవర్నర్ పర్యటనకు ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్, ఐటిడిఏ పి.ఓ. చిత్ర మిశ్రా, అదనపు కలెక్టర్లు సి హెచ్ మహేందర్ జి, సంపత్ రావు, డీఎస్పీ రవీందర్ లతో కలిసి తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ పర్యటన జిల్లా లో ఉన్న సందర్భంగా ఏర్పాట్లపై సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మంగళవారం తెలంగాణ గవర్నర్ దత్తత తీసుకున్న జిల్లాలోని తాడ్వాయి మండలం కొండపర్తి గ్రామమునకు వస్తున్న నేపథ్యంలో

అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని, అనంతరం మేడారం శ్రీ సమ్మక్క సారలమ్మ తల్లులను దర్శించుకుంటారని అన్నారు. గవర్నర్ పర్యటన సందర్భంగా ఎలాంటి లోటుపాట్లు జరగకుండా ముందస్తు ప్రణాళిక సిద్ధం చేసుకుని విజయవంతం చేయాలని ఆదేశించారు. షెడ్యూలు ప్రకారం కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. పరిశుద్ధ పనులు చేపట్టాలని, అతిథి గృహంలోని గదులను శుభ్రంచేయాలని, శానిటేషన్ చేయాలని సంబంధిత అధికారులను సూచించారు. గవర్నర్ పర్యటన ఏర్పాట్లను కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్ల మధ్య ఎటువంటి లోటు పాట్లు లేకుండా పకడ్బందీగా చేయాలని అధికారులను సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ వెంకటేష్, అన్ని శాఖల జిల్లా అధికారులు,
ములుగు, తాడ్వాయి మండలంల ఎంపిడిఓలు, తహసీల్దార్లు, ఎం పీలు, తదితరులు పాల్గొన్నారు.

## చలో ప్రజావాణి

**హామీల అమలుకు కలెక్టర్లకు వినతి పత్రాలు**



జగిత్యాల, మార్చి 10 (తీన్మార్ న్యూస్): మహాత్మ జ్యోతిరావు పూలే ప్రజా భవన్ లో ప్రజావాణిలో తెలంగాణ కోసం పోరాడిన ఉద్యమకారులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చినా హామీలను నెరవేర్చాలని 250 చదరపు గజాల భూమి మరియు 25,000/- పింఛన్ ఇవ్వాలని హామీల కొరకు ప్రజావాణిలో వినతి పత్రాలు అందజేయడానికి త్వరలో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఆధ్వర్యంలో తేదీ ప్రకటించడం జరుగుతుంది. చలో ప్రజావాణి 33 జిల్లాలోని ఉద్యమ కారులందరు పాల్గొని విజయవంతం చేయాలని కోరడం జరిగింది.

# ప్రజావాణి దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలి

**సోమవారం ప్రజావాణి కి 73 దరఖాస్తులు**

**ఉపాధి హామీ ప్రదేశాలలో త్రాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలి**

**వేసవిలో ప్రజలు అప్రమత్తంగా ఉండి జాగ్రత్తలు పాటించాలి**

**జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవర్**



సూర్యాపేట, మార్చి 10 (తీన్మార్ న్యూస్): ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యమిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవర్ అధికారులకు సూచించారు. సోమవారం కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో ప్రజావాణి కార్యక్రమానికి 73 ఫిర్యాదులు అందజేశారు.జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్ తో పాటు అదనపు కలెక్టర్ పి రాంబాబుకు తెలిపారు. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను వెంటనే పరిష్కరించే విధంగా ఆయా శాఖల అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. వడదెబ్బ తగలకుండా తగిన జాగ్రత్తలు పాటించాలని కలెక్టర్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రజావాణి అనంతరం కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించిన జిల్లా ట్రాన్స్పోర్ట్ సమావేశంలో మాట్లాడుతూ తీవ్రమైన వడదెబ్బకు ప్రజల గురి కాకుండా తీసుకోవలసిన జాగ్రత్తల గురించి ఆరోగ్యశాఖ సిబ్బంది అవగాహన కల్పించాలని సూచించారు. ఎండాకాలంలో తీవ్ర ఉష్ణోగ్రతల పెరిగే అవకాశం ఉన్నందున ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు అత్యవసరం అయితేనే తప్ప బయటకు రాకూడదని ముఖ్యంగా 60 సంవత్సరాలు పైబడిన వృద్ధులు బయటకు వెళ్లకూడదని కలెక్టర్ సూచించారు. గర్భిణీ స్త్రీలు మరియు చిన్న పిల్లలు దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వాళ్లు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఉపాధి హామీ పనులు జరిగే ప్రదేశాలలో కూలీలకు షేడ్ నేట్స్ ఏర్పాటు చేయాలని, త్రాగునీటి సౌకర్యం అలాగే ఓఆర్ఎస్ ప్యాకెట్లు కూడా సిద్ధంగా ఉంచాలని తెలిపారు. జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో తగినన్ని మందులు ఓఆర్ఎస్ పాకెట్స్ అందుబాటులో ఉండాలని కలెక్టర్ తెలిపారు. జిల్లా అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించినప్పుడు తగు జాగ్రత్తలు తీసుకోవాలని అన్ని పాఠశాలలో హాస్టల్స్ లో( ఫ్యాన్) గాలి పంకాలు వాడుకోనెలా సిద్ధం చేయాలన్నారు మహిళా ఉద్యోగులు క్యాప్స్ మరియు గొడుగులు తప్పక వాడాలన్నారు ఆర్డబ్ల్యూఎస్ అధికారులు త్రాగునీటి ఎద్దడి రాకుండా ఎల్లప్పుడూ పరిశీలిస్తూ చిన్నచిన్న మరమ్మత్తులను వెంటనే పూర్తి చేయాలని ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలవకుండా చూడాలని కలెక్టర్ తెలిపారు అనంతరం వైద్య ఆరోగ్యశాఖ అధికారులు జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా ఆరోగ్యం పై వేడి ప్రమాదం వేడి సంబంధిత అనారోగ్యాలు గోడ పత్రికలను మరియు పాంప్లెట్లను ఆవిష్కరించారు. అనంతరం తెలంగాణ స్టేట్ ఆల్ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ సూర్యాపేట జిల్లా శాఖ సభ్యులు తల్లిదండ్రుల వయోధికుల పోషణ మరియు సంక్షేమ చట్టం 2007 నియమావళి2011 తెలిపే గోడపత్రికలను కలెక్టర్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈవో వివి అప్పారావు, డీఎఫ్ సతీష్ కుమార్, సి పి ఓ ఎల్ కిషన్, డిఎంహెచ్వో కోటాచలం, డిఈఓ అశోక్ ,డి టి డి ఓ శంకర్, ఎస్సీ అభివృద్ధి అధికారి లత, జిల్లా వ్యవసాయ అధికారి శ్రీధర్ రెడ్డి, మైనార్టీ అధికారి జగదీశ్ రెడ్డి, పి డి ఎస్ సి కార్పొరేషన్ శ్రీనివాస్ నాయక్ ,జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి శ్రీనివాస్, జిల్లా పరిశ్రమల అధికారి సీతారాం నాయక్, డిఎస్ఓ రాజేశ్వరరావు, డి సి ఓ శ్రీనివాస్, కలెక్టరేట్ ఏవో సుదర్శన్ రెడ్డి, మెప్మా పీడీ రేణుక జిల్లా అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

## సమాజాభివృద్ధిలో మహిళల పాత్ర ఎంతో కీలకం




**మహిళలు సమానత్వంతో పాటు ఐక్యత కలిగి ఉండాలి**

**వ్యాపార, వృత్తి, ఉపాధి రంగాల్లో మహిళల గణనీయాభివృద్ధి**

**జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్**

జనగామ జిల్లా, మార్చి 10 (తీన్మార్ న్యూస్): సమాజాభివృద్ధిలో మహిళల పాత్ర ఎంతో కీలకమని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. సోమవారం, జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని మెయిన్ కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా మహిళా, శిశు, దివ్యాంగుల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అదనపు కలెక్టర్లు (స్థానిక సంస్థలు) పింకేష్ కుమార్, (రెవెన్యూ) రోహిత్ సింగ్ లతో కలిసి ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ పాల్గొని, జ్యోతి ప్రజ్వలన గావించి, కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ముందుగా మహిళామణులందరికీ అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. 80 శాతం వరకు మహిళలే జిల్లా అభివృద్ధికి తోడ్పాటునందిస్తున్నారని పేర్కొన్నారు. జిల్లా అభివృద్ధిలో వారి కృషి ఎంతో ఉందన్నారు. ఇదే స్ఫూర్తిని కొనసాగించాలన్నారు. మహిళలు ఇంటా, బయట సమానత్వంతో పాటు ఏకత్వంతో జీవితంలో ముందుకు వెళ్ళాలన్నారు. బాలికలు అంటే చిన్నచూపు చూడటం మానేయాలన్నారు. ఆడ, మగ మధ్య వ్యత్యాసం చూడకూడదన్నారు. వ్యాపార, వృత్తి, ఉపాధి రంగాల్లో మహిళ పాత్ర గణనీయమని, మహిళలు ఆర్థికాభివృద్ధి కలిగి ఉండాలని, ప్రతి ఆడపిల్లను తమ తల్లితండ్రులు ఖచ్చితంగా చదివించాలని, వారికి అండగా నిలవాలని, అదే విధంగా మహిళలు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, వ్యక్తిగత, ఉద్యోగరీత్యా జీవితంలో సమతుల్యత పాటించాలని తెలిపారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు వీక్షకులను ఎంతగానో అలరించాయి. అలాగే ఆర్బీఎస్కేల ద్వారా చేపట్టిన స్క్రీనింగ్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు కళ్లజోళ్లను అందించారు. అనంతరం కేక్ కట్ చేశారు. అలాగే ఐడీఓసీని నిత్యం పరిశుభ్రంగా ఉంచుతున్న మహిళా శానిటేషన్ సిబ్బందిని, మున్సిపల్ మహిళా పారిశుధ్య కార్మికులను శాలువాలతో సత్కరించి, బహుమతులు అందజేశారు. అదే విధంగా వివిధ శాఖలకు చెందిన మహిళా అధికారులను, ఉత్తమ మహిళా ఉద్యోగులను ప్రశంసాపత్రాలతో పాటు బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ సీఈవో మాధురీ కిరణ్ చంద్ర షా, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సుహాసిని, జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ అధికారిణి ఫ్లోరెన్స్, డీపీఓ స్వరూప, డీఆర్డీఏ వసంత, డిప్యూటీ జెడ్పీ సీఈవో సరిత, డీఎంహెచ్ఓ మల్లికార్జున రావు, జౌళి శాఖ అధికారిణి చౌడేశ్వరి, వివిధ శాఖల జిల్లా అధికారులు, టీజీవోస్ ప్రెసిడెంట్ శ్రీనివాస్, టీఎన్జీవోస్ ప్రెసిడెంట్ ఖాజా షరీఫ్, సీడీపీవో రమాదేవి, మహిళా సాధికారత కేంద్రం జిల్లా కో-ఆర్డినేటర్ హెచ్. శారద, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా ఉపాధి కార్యాలయంలో జాబ్ మేళ



మహబూబాబాద్ జిల్లా, మార్చి 10 (తీన్మార్ న్యూస్): జిల్లా ఉపాధి కార్యాలయ%శీ%, మహబూబాబాద్ ఆధ్వర్యంలో వై.యస్.కే.ఇన్ఫో టెక్ ప్రైవేట్ లిమిటెడ్, రంగారెడ్డి, హైదరాబాద్ నందు గల ఖాళీలను నింపుటకు అర్హత కల్గిన నిరుద్యోగ స్త్రీలకు మాత్రమే ఇంటర్వ్యూలు నిర్వహించుటకై 12.03.2025 న జాబ్ మేళ నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి టి.రజిత నేడు ఒక ప్రకటనలో తెలిపారు. 18-28 మధ్య వయసు కలిగి యుండి 10%ష్ట%, ఇంటర్, డిగ్రీ(పాస్/ఫెయిల్) విద్యార్హత తో ఆసక్తి గల స్త్రీలు దరఖాస్తు చేసుకోగలరని ఈ సందర్బంగా ఆమె పేర్కొన్నారు. అర్హత ఆసక్తి కల్గిన స్త్రీలు తేది: 12.03.2025 న జిల్లా ఎంప్లాయ్ మెంట్ కార్యాలయం, రూమ్ నెం.25, రెండవ అంతస్తు, సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయము, కురవి రోడ్ మహబూబాబాద్ అడ్రస్ నందు ఉదయం 10.30 గం.ల నుండి మద్యాహ్నం 2.00 గం.ల వరకు జరుగు జాబ్ మేళాకు అన్ని విద్యార్హతల సర్టిఫికెట్లు / రెజ్యూం తో హాజరై ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని జిల్లా ఉపాధి అధికారి కోరారు. మరిన్ని వివరాలకు ఫోన్ నెం : 7093514418 ద్వారా సంప్రదించి వివరాలు పొందవచ్చు.

## రాష్ట్ర స్థాయి సైక్లింగ్ పోటిల్లో జిల్లా క్రీడాకారుల విజయకేతనం

**గోల్డ్ మెడల్స్, సిల్వర్ మెడల్స్ సాధించి జిల్లాకి ప్రత్యేక గుర్తింపు**

**క్రీడాకారులకు సన్మానం చేసిన జిల్లా అధ్యక్షులు బాదం ప్రవీణ్**





ములుగు, మార్చి 10 (తీన్మార్ న్యూస్): ఇటీవల హైదరాబాద్ లో జరిగిన రాష్ట్ర స్థాయి సైక్లింగ్ పోటిల్లో ములుగు జిల్లా నుంచి క్రీడాకారులు 24 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. అందులో కొంతమంది క్రీడాకారులు సైక్లింగ్ పోటిల్లో అత్యంత ప్రతిభకనబర్చి విజయకేతనం ఎగురవేయటంతో పాటు గోల్డ్ మెడల్స్, సిల్వర్ మెడల్స్ సాధించి ములుగు జిల్లాకు ప్రత్యేక గుర్తింపు తెచ్చారు. ఈ సందర్భంగా సోమవారం సైక్లింగ్ అసోసియేషన్ అధ్యర్యంలో ములుగు జిల్లా కేంద్రంలో క్రీడాకారులకు సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమం కు ముఖ్య అతిథులుగా సైక్లింగ్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు బాదం ప్రవీణ్ హాజరై క్రీడాకారులకు ఘనంగా సన్మానం చేశారు. ఇచ్చిన మాట ప్రకారంగా క్రీడాకారులకు సైక్లింగ్ క్రీడల్లో ఉపయోగించే సైకిల్ ను అందించనున్నట్లు బాదం ప్రవీణ్ తెలిపారు.

## ప్రజావాణి ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాల



**అదనపు కలెక్టర్ అశోక్ కుమార్**

జయశంకర్ భూపాలపల్లి జిల్లా, మార్చి 10 (తీన్మార్ న్యూస్): ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ అశోక్ కుమార్ అధికారులకు సూచించారు. సోమవారం ఐడిఓసి కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 45 ఫిర్యాదులు వచ్చినట్లు తెలిపారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారుల నుండి అదనపు కలెక్టర్ స్వీకరించి పరిష్కారానికి చర్యలు చేపట్టాలని సంబంధిత శాఖల అధికారులకు ఎండార్స్మెంట్ చేసినట్లు తెలిపారు. దరఖాస్తులు పెండింగ్ ఉంచకుండా ఎప్పటికప్పుడు పరిశీలన చేస్తూ పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఎల్ఆర్ఎస్ ను సద్వినియోగం చేసుకోవాలి

**ఈ నెలాఖరు వరకే 25 శాతం రాయితీతో గడువు**

**హనుమకొండ, వరంగల్ జిల్లాల కలెక్టర్లు పి. ప్రావీణ్య, డాక్టర్ సత్య శారద**



హనుమకొండ జిల్లా, మార్చి 10 (తీన్మార్ న్యూస్): ప్రభుత్వం కల్పిస్తున్న రాయితీ సదుపాయాన్ని లేఅవుట్, నాన్ లేఅవుట్ యజమానులు, డెవలపర్లు, ప్లాట్ల యజమానులు సద్వినియోగం చేసుకోవాలని హనుమకొండ, వరంగల్ జిల్లాల కలెక్టర్లు పి. ప్రావీణ్య, డాక్టర్ సత్య శారద అన్నారు. సోమవారం హనుమకొండ లోని కుడా కార్యాలయంలో ఇరు జిల్లాల కలెక్టర్లు, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ డాక్టర్ అశ్విని తానాజీ వాకడే, సంబంధిత శాఖల అధికారులతో కలిసి ఎల్ఆర్ఎస్ పై లేఅవుట్ డెవలపర్లు, సర్వేయర్లు, యజమానులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్లు ప్రావీణ్య, సత్య శారద మాట్లాడుతూ ఎల్ఆర్ఎస్ కు దరఖాస్తు చేసుకున్న దరఖాస్తుదారులు రెగ్యులరైజ్ చేసుకోవాలని అన్నారు. ప్రభుత్వ నియమ నిబంధనల మేరకు అనుమతులు ఇవ్వడం జరుగుతుందన్నారు. 26 ఆగస్టు 2020 కు ముందు రిజిస్ట్రేషన్ అయిన తర్వాత కచ్చా లేఔట్ చేసిన వారు, వాటిలో ప్లాట్ లు తీసుకున్న ఎల్ఆర్ఎస్ కు వచ్చిన దరఖాస్తుదారులు క్రమబద్ధీకరించుకొనేలా అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. రెగ్యులరైజ్ చేసుకోవడానికి 25 శాతం రాయితితో ఈ నెలాఖరు (మార్చి 31) వరకే ప్రభుత్వం గడువు కల్పించిందని అన్నారు. గడువు పొడగింపు ఉండదని, కల్పిస్తున్న రాయితీ ప్రోత్సాహకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. లే అవుట్ లు చేసిన వారు, ఓనర్లు, రైటర్ లు, బిల్డర్లు ప్లాట్లు కొనుగోలు చేసిన వారికి సమాచారం,

అవగాహన కల్పించి సకాలంలో ఎల్.ఆర్.ఎస్. చేయించుకునే విధంగా బాధ్యతలు తీసుకోవాలన్నారు. ప్రజలకు అవగాహన లేకపోవడం లేదా సమాచారం లేకపోవడం వల్ల సద్వినియోగం చేసుకోకుంటే రేపటినాడు ఎప్పుడైనా ఎల్.ఆర్.ఎస్ ఆమోదం లేని ప్లాటు పై ఇల్లు కట్టుకోవాలంటే అప్పటి ప్లాట్ వాల్యూ పై ప్రో రేట్ ఫీజు తో పాటు 14 శాతం పెనాల్టీ చెల్లించాల్సి ఉంటుందని తెలియజేశారు. నిషేధిత స్థలం లేదా చెరువు, కుంట కింద లేకుంటే ప్లాట్ల యజమాని ఫోన్ కు నేరుగా ఎంత డబ్బులు కట్టాలో సమాచారం వెళుతుందన్నారు. ఏదేని కారణం చేత ఎల్.ఆర్.ఎస్. తిరస్కరణకు గురి అయితే చెల్లించిన డబ్బుల నుంచి 10 శాతం ప్రాసెసింగ్ ఫీజు కింద మినహాయించుకొని మిగిలిన 90 శాతం డబ్బులు తిరిగి ప్లాటు యజమాని ఖాతాలో జమ చేయడం జరుగుతుందని వివరించారు. ఎల్.ఆర్.ఎస్ ఉంటే ప్లాటుకు రక్షణ ఉంటుందని, ఎవరు అక్రమించుకోడానికి అవకాశం ఉండదని అదేవిధంగా లే అవుట్ ప్లాట్ల ప్రాంతాన్ని మున్సిపాలిటీ ద్వారా అభివృద్ధి చేసే అవకాశం ఉంటుందన్నారు. భవిష్యత్తులో ప్లాటు అమ్ముకోవాలనుకున్న ఎల్. ఆర్ ఎస్ ఉన్న ప్లాటు కు మంచి డిమాండు ఉంటుందని తెలియజేశారు. అధికారులు,మున్సిపల్ కమిషనర్లు, బిల్డర్లు, లే అవుట్ ప్లానర్ ప్లాటు యజమానులతో సంప్రదించి ప్రభుత్వం కల్పించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేవిధంగా చూడాలని కోరారు. ఈ సందర్భంగా ఎల్ఆర్ఎస్ చేసుకోవడంపై డెవలపర్లు, ప్లాట్ల యజమానులు అడిగిన పలు సందేహాలను కలెక్టర్లు, కమిషనర్ నివృతి చేశారు. ఈ సమావేశంలో కుడా పిఓ అజిత్ రెడ్డి, సిటీ ప్లానర్ రవీందర్,జిల్లా రిజిస్ట్రేషన్ అధికారి, సంబంధిత శాఖల అధికారులతో పాటు లేఅవుట్, నాన్ లేఅవుట్ యజమానులు డెవలపర్లు, టౌన్ ప్లానర్ లు, లే అవుట్ రైటర్ లు, బిల్డర్లు, సర్వేయర్లు తదితరులు పాల్గొన్నారు.

# మిలియన్ మార్చ్'తో ఉద్యమం ఉవ్వెత్తున ఎగసి పడింది

**ఎక్స్ వేదికగా హరీశ్ రావు ట్వీట్**

**అమరవీరులను స్మరించుకున్న నెటిజన్లు.. రాష్ట్ర ప్రజలు**



తెలంగాణ బ్యూరో, మార్చ్ 10 (తీన్మార్ న్యూస్): స్వరాష్ట్ర సాధన కోసం ఉవ్వెత్తున ఎగసిన ఉద్యమ ప్రస్థానంలో మిలియన్ మార్చ్ ఒక కీలక ఘట్టం. (మార్చి 10, 2011) సోమవారంతో 14 ఏళ్ళు పూర్తి చేసుకున్న సందర్భంగా రాష్ట్రం కోసం ప్రాణాలు అర్పించిన అమరవీరులను నెటిజన్లు, ప్రముఖులు, రాజకీయ నాయకులు సర్మించుకున్నారు. చాలా మంది నెటిజన్లు వారు మిలియన్ మార్చ్‌లో పాల్గొన్నప్పటి ఫోటోలను ఎక్స్ వేదిగా జ్ఞాపకాలను పంచుకున్నారు. ఈ క్రమంలోనే ఎక్స్ వేదికగా హరీశ్ రావు ట్వీట్ చేశారు. 'మిలియన్ మార్చ్'తో తెలంగాణ ఉద్యమం ఉవ్వెత్తున ఎగసి పడిందన్నారు. ఆంక్షల పద్మవ్యూహాన్ని బద్దలు కొట్టుకుని లక్షలాదిగా జనం తరలివచ్చారని వెల్లడించారు. ప్రపంచ ప్రజా ఉద్యమాల సరసన తెలంగాణ ఉద్యమాన్ని నిలిపిన అసలు సిసలు ప్రజా విప్లవం అని పేర్కొన్నారు. ఆంక్షలు, నిర్బంధాల కట్టడిని చిత్తడి చేసి జలమార్గం గుండా ట్యాంక్ బండ్ చేరుకొని, మిలియన్ మార్చ్ లో పాల్గొని నేటికీ 14 ఏళ్లు ఆ అపురూప దృశ్యాలు ఇప్పటికీ కళ్ళ ముందు కదలాడుతున్నాయన్నారు. నాటి ఉద్యమ పోరాటాలు ఇంకా రగిలిస్తూనే ఉన్నాయని తెలిపారు. స్వరాష్ట్ర సాధన కోసం కేసీఆర్ గారి నాయకత్వంలో తెలంగాణ ప్రజలు చూపిన తెగువకు, పోరాటానికి సెల్యూట్ ప్రాణాలు సైతం అర్పించిన అమరులకు జోహార్ అని వెల్లడించారు

# అంగన్వాడి కేంద్రం ఏర్పాటు కోరుతూ కలెక్టర్ కి వినతి



సూర్యాపేట, మార్చి 10 (తీన్మార్ న్యూస్): సూర్యాపేట జిల్లా పాలకీడు మండలం జాన్ పహాడ్ దర్గా గ్రామపంచాయతీ కల్మెట్ తండాలో అంగన్వాడి కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ కు గిరిజన శక్తి రాష్ట్ర నాయకుడు మధు నాయక్ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ కార్యాలయం లో వినతి పత్రం అందజేసారు. ఈ సందర్భంగా మధు నాయక్ మాట్లాడుతూ జనాభా ప్రకారం 500 కుటుంబాలు 13 వందల ఓటర్లున్న కల్మెట్ తండాకు మరొక అంగన్వాడి కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని అదేవిధంగా దర్గా వద్ద మినీ అంగన్వాడి ఏర్పాటు చేయాలని అంగన్వాడి కేంద్రాల్లో సిబ్బంది లేక ఎక్కువ చిన్న పిల్లలు గర్భిణీలు బాలింతలు ఉన్నందున మరొక అంగన్వాడి కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని వినతి పత్రంలో పేర్కొన్నట్లు మధు నాయక్ తెలిపారు. వారు స్పందించి త్వరలో ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారని చెప్పారు. ఈ కార్యక్రమంలో గిరిజన శక్తి నాయకులు శ్రీరామ్ నాయక్, సంగీయ నాయక్,సైదా నాయక్ పాల్గొన్నారు.

# ప్రజావాణి దరఖాస్తులపై అలసత్వం తగదు

**జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్**



జనగామ జిల్లా, మార్చి 10 (తీన్మార్ న్యూస్): ప్రజావాణికి వచ్చే దరఖాస్తులపై అలసత్వం తగదని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అధికారులను ఆదేశించారు. సోమవారం, జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని మెయిన్ కాన్ఫరెన్స్ హాల్లో ఏర్పాటు చేసిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు (స్థానిక సంస్థలు) పింకేష్ కుమార్, (రెవెన్యూ) రోహిత్ సింగ్ లతో కలిసి జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ వివిధ సమస్యలతో వచ్చే ప్రజల నుంచి ప్రజావాణి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా 73 అర్జీలను కలెక్టర్ స్వీకరించారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన విజ్ఞప్తుల పరిష్కారం దిశగా అత్యంత ప్రాధాన్యతతో ప్రత్యేక శ్రద్ధ వహించాలని అధికారులకు సూచించారు. వచ్చిన అర్జీలను సంబంధిత శాఖల అధికారులకు అందించి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. అదే విధంగా అర్జీలు పెండింగ్ లో లేకుండా త్వరితగతిన పరిష్కరించి, పూర్తిచేయాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. అదే విధంగా ప్రజల నుంచి స్వీకరించిన ఫిర్యాదుల పరిష్కారానికై అన్ని మండలాల సంబంధిత తహసీల్దార్ లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్ సమీక్షించి, ఫిర్యాదుల పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా వచ్చిన దరఖాస్తులను వెంటనే పరిశీలించి, పరిష్కరించాలని ఆదేశించారు. ఎటువంటి నిర్లక్ష్యం వహించరాదని, పెండింగ్ లో లేకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సూచించారు. అలాగే మండల స్థాయిలో ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రతి సోమవారం తప్పనిసరిగా నిర్వహించాలని, అందుకు తగ్గట్లుగా ప్రచారం చేపట్టాలని ఆదేశించారు. అడవికేశవాపూర్ గ్రామం, జనగామ మండలానికి చెందిన ఎం. సోమయ్య, రెవెన్యూ శాఖకు సంబంధించి, తన నాలుగు ఎకరాల భూమి ధరణి కారణంగా వేరే వారి పేరు మీద నమోదు అయింది. కావున తన పేరు మీదకు నమోదు చేయుట కోరుతూ దరఖాస్తు చేసుకున్నారు. దేవరుప్పుల గ్రామం, దేవరుప్పుల మండలానికి చెందిన గోలి సోమ రెడ్డి, తన వారసత్వ భూమి సర్వే నంబర్ 525/%దీ%, 530, 531, 526, 527ల పట్టా మార్పిడి కొరకు దరఖాస్తు చేసియున్నారు. యశ్వంతాపురం గ్రామం, జనగామ మండలానికి చెందిన శెట్టి కార్తీక్, తన సర్వే నంబర్ 201 భూమిలో పక్క రైతు ఆక్రమించుకోగా, అతడు ఆక్రమించుకున్న నా భూమిని ఇప్పించగలరని ఆర్జీ ద్వారా కోరారు. జనగామకు చెందిన కొన్యాల లక్ష్మా రెడ్డి, తన పది గుంటల భూమికి సంబంధించి ధరణి పోర్టల్ లో గల టీఎం15 మాడ్యూల్ లోని దరఖాస్తు నంబర్ లను నిలిపివేయుట కోసం వినతిపత్రం సమర్పించనైనది. వంగాలపల్లి గ్రామం, చిల్పూర్ మండలానికి చెందిన అరూరి. స్వామి, సర్వే నంబర్ 143/110 లో గల తన భూమి ఆక్రమణపై చర్యలు తీసుకోవాలని కోరుతూ దరఖాస్తును సమర్పించినారు. ఈ ప్రజావాణిలో జనగామ, ఘనపూర్ (స్టేషన్) స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు సుహాసిని, హనుమాన్ నాయక్, జనగామ ఆర్డీవో గోపీరాం, డిడబ్ల్యూఓ ఫ్లోరెన్స్, డిఎఓ రామారావు నాయక్, సీపీఓ పాపయ్య, మునిసిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, డీఆర్డీఏ వసంత, డీపీఓ స్వరూప, సంబంధిత శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# నోటిఫికేషన్లకు ఎస్సీ వర్గీకరణ వర్తింపజేయాలని డిమాండ్



హైదరాబాద్, మార్చ్ 10 (తీన్మార్ న్యూస్ ): తెలంగాణలో సోమవారం నుంచి వివిధ పరీక్షల ఫలితాలను టీజీపీఎస్సీ విడుదల చేస్తున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో నేడు గ్రూప్ 1 పరీక్షల ప్రొవిజనల్ మార్కుల లిస్టును విడుదల చేసింది. నేడు గ్రూప్ 2 పరీక్షల జనరల్ ర్యాంక్ కార్డులను విడుదల చేయనుంది. అయితే ఎస్సీ వర్గీకరణ జరిగేంత వరకు అన్ని ఉద్యోగ పరీక్ష ఫలితాలను నిలిపివేయాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ డిమాండ్ చేశారు. ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ హైదరాబాద్ జిల్లా కమిటీల ఆధ్వర్యంలో ఇందిరా పార్క్ వద్ద సోమవారం జరిగిన రిలే నిరాహార దీక్షలకు మంద కృష్ణ మాదిగ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంద కృష్ణ మాదిగ మాట్లాడుతూ గత నోటిఫికేషన్లకు వర్గీకరణ వర్తింపజేస్తామని గతంలో ఇచ్చిన మాటను సీఎం రేవంత్ రెడ్డి నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. ఉమ్మడి రాష్ట్రంలో చంద్రబాబు సీఎంగా ఉన్న సమయంలో ఎస్సీ వర్గీకరణ చట్టం రూపొందించారని తెలిపారు. ఆ చట్టంలో గతంలో ఇచ్చిన ప్రతి ఉద్యోగ నోటిఫికేషన్‌కు వర్గీకరణ సూత్రం వర్తింపజేసేలా 4వ నిబంధనను పొందుపరిచారని చెప్పారు. ఆ చట్టాన్ని ఇప్పుడు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి పరిశీలించాలని సూచించారు. గతంలో ఇచ్చిన నోటిషికేషన్‌లో వర్గీకరణ ప్రకారం ఉద్యోగ నియామకాలు చేపట్టడం సాధ్యం కాదని కొంతమంది దుష్ప్రచారం చేస్తున్నారని అన్నారు. గతంలో చంద్రబాబు చూపెట్టిన నిజాయితీని రేవంత్‌రెడ్డి చూపెడితే ప్రతి ఉద్యోగ నోటిఫికేషన్‌లో వర్గీకరణ అమలు జరుగుతుందని అన్నారు. వర్గీకరణ వ్యతిరేక తీర్పును వేగంగా అమలు చేశారని, వర్గీకరణ అమలు తీర్పును అమలు చేయడానికి కొర్రీలు ఎందుకు పెడుతున్నారని ప్రశ్నించారు. అప్పుడు కాంగ్రెస్, ఇప్పుడు కాంగ్రెస్సే అధికారంలో ఉందని గుర్తుచేశారు. ఓ వైపు ఎస్సీ వర్గీకరణ చట్టం వస్తుందని చెబుతూనే మరోవైపు చట్టం రాకముందే ఉద్యోగ పరీక్ష ఫలితాలను విడుదల చేయడం మాదిగలకు ద్రోహం చేయడమేనని అన్నారు. గ్రూప్ 1, 2, 3, హాస్టల్ వార్డెన్, ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్స్ తదితర అన్ని ఉద్యోగ ఫలితాలను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం మాదిగలకు చేస్తున్న అన్యాయాన్ని ఎదుర్కోవడానికి ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని చెప్పారు. తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ఇప్పుడు దీక్షలు కొనసాగుతున్నాయని తర్వాత శాంతియుతంగా ధర్నాలు, రాస్తారోకోలు నిర్వహిస్తామని అన్నారు. తహశీల్దార్, కలెక్టర్ కార్యాలయాల ముట్టడిలు చేపడతామని ఆయన తెలిపారు.

# ఏఐతో విద్యాబోధన విద్యార్థుల పాలిట వరం

**జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్**



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, మార్చి 10 (తీన్మార్ న్యూస్): ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏ ఐ) తో విద్యాబోధన విద్యార్థుల కు వరంగా మారనున్నదని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ అన్నారు. సోమవారం బూర్గంపాడు మండలం అంజనాపురం ఎంపీపీ ఎస్ పాఠశాలల్లో ఏఐతో విద్యా బోధన తరగతులను కలెక్టర్ పరిశీలించారు. విద్యార్థుల అభ్యాసన మరింత ఆకర్షణీయంగా, ఇంట్రాక్టివ్ గా నిర్వహించటానికి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ మెరుగ్గా సహకరిస్తుందన్నారు. దీంతో విద్యార్థుల స్థాయిని అంచనా వేస్తూ అందుకు తగినట్లు అభ్యాస కృత్యాలు జనరేట్ చేయడంతో విద్యాభ్యాసం పట్ల పిల్లల్లో మరింత ఉత్సాహం పెంచేలా బోధన చేయవచ్చు అన్నారు. విద్యార్థుల కంప్యూటర్ ల్యాబ్ లో కలెక్టర్ ముచ్చటిస్తూ చిన్నారులకు ఉత్సాహమే ప్రేరణగా ఆధారిత విద్యాబోధనను జిల్లాలో ప్రారంభించామన్నారు. కనుక పిల్లలందరూ నిరంతరంగా ప్రతిరోజు కంప్యూటర్ ల్యాబ్ ను వినియోగించాలని అన్నారు. బూర్గంపాడు మండలంలో అంజనాపురం, మొరంపల్లి బంజారా, బూర్గంపాడు 2, నాగినేని ప్రోలు మరియు సారపాక లోని గాంధీనగర్ పాఠశా లలో ప్రయోగాత్మకంగా ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారన్నారు. ఏఐ ఆధారిత బోధన లో భాగంగా మండలం నుంచి ఒక ఉపాధ్యాయుని హైదరాబాదుకు ఏఐ విద్యా బోధనలో శిక్షణకు పంపించడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఏఐ ఆధారిత విద్య బోధనలో ఉపాధ్యాయుల తీరును సంబంధిత ఎంఈఓ లు పర్యవేక్షిస్తూ కార్యక్రమాన్ని రోజువారీగా సమీక్షించాలని కలెక్టర్ ఆదేశించారు. అనంతరం కలెక్టర్ బూర్గంపాడు ఆశ్రమ పాఠశాల మరియు కళాశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. సందర్భంగా కలెక్టర్ పాఠశాలల్లోని తరగతి గదులు, మరుగుదొడ్లు, కిచన్ షెడ్ పాఠశాల ఆవరణాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ తరగతి గదిలో విద్యార్థులకు ఉపాధ్యాయులు బోధిస్తున్న విద్యా తరగతులను పరిశీలించారు. తరగతి గదిలో విద్యార్థుల కు పుస్తక పఠనంలో ఉన్న నైపుణ్యాన్ని హిందీ పాఠ్యపుస్తకాన్ని చదివించి పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులతో మాట్లాడుతూవారికి గల ఆసక్తి పాఠశాలలో విద్యాబోధన, అమలు చేస్తున్న మెనూపై ఆరా తీశారు. విద్యార్థుల సం ఖ్య, పాఠశాలలో రోజు వారి అమలు చేస్తున్న మె నూ ప్రకారం, లెసన్ ప్రణాళికలు, టాయిలెట్స్ నిర్వ హణలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు ప్రశాంతమైన వాతావరణంలో చదవటానికి వీలుగా అన్ని సౌకర్యాలు కల్పించాలని, ఉపాధ్యాయులు విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో పాఠాలను బోధించాలని ఆదేశించారు. అదేవిధంగా పాఠశాల ఆవరణలో నీరు నిల్వ లేకుండా ఇంకుడు గుంతలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పాఠశాలలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కావలసిన ప్రణాళికలను రూపొందించి నివేదికలు అందజేయాలని అధికారులను ఆదేశించారు. మొరంపల్లి బంజర్ లో నూతన కమ్యూనిటీ హెల్త్ సెంటర్ నిర్మాణానికి కలెక్టర్ స్థల పరిశీలన చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మొరంపల్లి బంజరు లో కమ్యూనిటీ హెల్త్ సెంటర్ స్థాపనకు వేపల గడ్డ బస్టాండ్ సమీపంలో సూచించిన నాలుగు ఎకరాల భూమిని పరిశీలించి, సంతృప్తిని వ్యక్తం చేశారు. స్థలం చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేయవలసిందిగా అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో కలెక్టర్ వెంట బూర్గంపాడు డిప్యూటీ తాసిల్దార్ నరేష్, బూర్గంపాడు ఎంఈఓ, పాఠశాలల సిబ్బంది మరియు విద్యార్థులు అధికారులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్సీ ఎన్నికలకు ముగిసిన నామినేషన్ల గడువు

మొదటి పేజీ తరువాయి

ఆధారంగా కాంగ్రెస్ కు 4 స్థానాలు దక్కగా బీఆర్ఎస్ కు ఒక స్థానం దక్కింది. అయితే పొత్తులో భాగంగా తమ 4 స్థానాల్లో ఒకదానిని సీపీఐకి కేటాయిస్తున్నట్టు కాంగ్రెస్ అధిష్టానం నిర్ణయం తీసుకుంది. కాగా కాంగ్రెస్ తరపున విజయశాంతి, అద్దంకి దయాకర్, కేతావత్ శంకర్ నాయక్ లు బరిలో ఉండగా వీరి మిత్రపక్షం సీపీఐ తరపున నెల్లికంటి సత్యం పేరును ఖరారు చేసింది ఆ పార్టీ. ఇక గులాబీ పార్టీ తరపున దాసోజు శ్రవణ్ కుమార్ పేరును ప్రకటించారు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్. వీరితోపాటు చలిక చంద్రశేఖర్, భోజరాజ్ కోయాల్కర్, జాజుల భాస్కర్, కంటే సాయన్నలు ఇండిపెండెంట్ గా పోటీ చేస్తున్నారు. ఈ 11 మంది అభ్యర్థులు సోమవారం నామినేషన్ దాఖలు చేశారు. ఇక ఏపీలో కూటమికి ఉన్న ఎమ్మెల్యేల సంఖ్యా బలాన్ని బట్టి 5 స్థానాలు దక్కగా అందులో ఒక స్థానాన్ని జనసేన కు మరో స్థానాన్ని బీజేపీ కి కేటాయించి, మిగిలిన మూడు స్థానాలకు అభ్యర్థుల పేర్లను వెల్లడించింది టీడీపీ. టీడీపీ నుంచి కావాలి గ్రీష్మ, బీద రవిచంద్ర, బీటీ నాయుడు పేర్లను ప్రకటించగా.. జనసేన తరపున కొణిదెల నాగబాబు, బీజేపీ తరపున సోము వీర్రాజు బరిలో ఉన్నారు. ఈ ఎన్నికలకు ఈనెల 20న పోలింగ్ జరగనుండగా అదే రోజు సాయంత్రం ఓట్ల లెక్కింపు జరుపుతారు.



# విపక్షాల సమర్థతకు విషమ పరీక్ష!

పార్లమెంట్ మలివిడత బడ్జెట్ సమావేశాలు సోమవారం ప్రారంభం అయ్యాయి. దేశంలో ఉన్న సమస్యల దృష్ట్యా ఈ సమావేశాలే కీలకం. ఈ సమావేశాల్లో ఏ అంశంపై చర్చించాలి..చర్చించకూడదు.. సభాసమయాన్ని సద్వినియోగం చేసుకోవడమెలా అన్నది కూడా విపక్ష కాంగ్రెస్ చతురతపై ఆధారపడి ఉంది. అలాగే విపక్షాలు కూడా సమర్థత ప్రదర్శించాల్సి ఉంది. కేవలం అల్లరి చేసి వాకట్లు చేయడమో. ప్రతిష్టంభనతో సభ వాయిదా వేయించడం వల్లనో సమస్యలు చర్చకు రావు. ఇది గమనించి కాంగ్రెస్ వ్యూహాత్మకంగా వ్యవహరించాల్సి ఉంది. లేకుంటే అది విపక్ష పార్టీగా విఫలం అయినట్లే. ప్రధానంగా డిటిమిటేషన్ భయాలు, జనగణన,జిఎస్టీ, నిరుద్యోగం, ఔషధధరలు, పెరుగుతున్న నిత్యావసర ధరలు వంటి ప్రధాన సమస్యలు దేశాన్ని పట్టిపీడిస్తున్నాయి. ప్రధానంగా ఇప్పుడు డీలిమిటేషన్‌పై సర్వత్రా చర్చ నడుస్తోంది. దక్షిణాది రాష్ట్రాల్లో జనాభా ప్రాతిపదికన సీట్లు తగ్గుతాయని ఆందోళన వ్యక్తం అవుతోంది. దీనిపై బిజెపి లేదా ప్రభుత్వం స్పష్టత ఇవ్వడం లేదు. తెలంగాణ బిజెపి నేతలు మాత్రం సీట్లు తగ్గవని అంటున్నారు. ఇంతకీ ఇప్పుడున్న సీట్లు తగ్గవా లేక, పెరిగే సీట్లు తగ్గవా అన్నది స్పష్టం చేయకుండా గోడవాటం పిల్లిలా వ్యవహరిస్తున్నారు. అమెరికా తరహాలోనే భారత్ కూడా ప్రజ్యాస్వామ్య వ్యవస్థ కలిగిన సమాఖ్య రాజ్యం. 1971లోని జనాభా నిష్పత్తి ప్రకారం ప్రాతినిధ్యం కల్పించడం వల్ల ఊహించని ప్రమాదాలు ఎదురవుతాయనే వాస్తవాన్ని గుర్తించాము. అయితే ఒక పరిష్కారాన్ని కనుగొనడానికి బదులు దాన్ని 2026 దాకా వాయిదా వేశాము. చివరి జనాభా గణన 2011లో జరిగింది. తదుపరి జనాభా గణన 2021లో జరగవలసి ఉండగా కోవిడ్ విలయం వల్ల వాయిదా వేశారు. 2021 నుంచి ఏదో ఒక సాకుతో జనాభా గణన జరగనే లేదు. తాజాగా కులగణన అంటూ కాంగ్రెస్ రాజకీయాలు మొదలు పెట్టింది. దీంతో సమాజంలో చీలిక తప్ప మరోటి రాదు. ఇది ఓ రకంగా అచ్చం రాజకీయ లబ్ధికోసం చేస్తున్న డిమాండ్ తప్ప మరోటి కాదు. ఈ క్రమంలో 2026లో జనాభా గణన అనంతరం విధిగా లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన జరగవలసి ఉన్నది. ప్రతి రాష్ట్రానికి కేటాయించే సీట్ల సంఖ్యను కూడా అప్పుడే నిర్ణయిస్తారు. జనాభా పెరుగుదల అదుపులేకుండా జరిగినందుకు కొన్ని రాష్ట్రాలకు ప్రయోజనాలు కల్పిస్తారు. సంపూర్ణ ప్రజనన రేటు 2 శాతం, అంతకంటే తక్కువగా ఉండాలన్న నిర్దేశిత లక్ష్యాన్ని సాధించిన రాష్ట్రాలను సీట్ల కుదింపుతో శిక్షించనున్నారన్న ప్రచారం సాగుతోంది. ఇలా కేవలం జనాభా ప్తరాపిదకిగా కాకుండా మధ్యేమార్గం అవలంబించాల్సిన అసవరం ఇప్పుడు కనిపిస్తోంది. పునర్విభజనతో దక్షిణాది రాష్ట్రాలు తీవ్రంగా నష్టపోతాయని తమిళనాడు సిఎం స్టాలిన్ పోరుబాట పట్టారు. జనాభా నిష్పత్తి సూత్రానికి అనుగుణంగా ఆయా రాష్ట్రాల సీట్ల సంఖ్యను పునర్ నిర్ధారించడం ద్వారా దక్షిణ్రాది రాష్ట్రాలకు నష్టం జరగడం ఖాయంగా కనిపిస్తోంది. దక్షిణాది రాష్ట్రాల్లో ఇప్పుడు లోక్‌సభలో 129 స్థానాలున్నా వారి గళం పెద్దగా విన్పించడం లేదు. ఇప్పుడా సీట్ల సంఖ్య మరింతగా తగ్గితే దక్షిణాది ప్రతినిధుల మాటను కేంద్రం పట్టించుకోదు. సీట్ల సంఖ్య తగ్గించబోమనే హామీలో నిజాయితీ కొరవడింది. ఇదే సందర్భంలో జనాభా అత్యధికంగా ఉన్న యూపీ, బిహార్, రాజస్థాన్, మధ్యప్రదేశ్‌ల సీట్ల సంఖ్యను పెంచబోమని కేంద్రం స్పష్టంగా ప్రకటించడం లేదు. సీట్ల సంఖ్య పునర్ నిర్ధారణకు జనాభా నిష్పత్తి సూత్రాన్ని అనుసరించిన పక్షంలో దక్షిణాది రాష్ట్రాల బలం మరింతగా తగ్గిపోతుంది. పర్యవసానంగా పార్లమెంటులో దక్షిణాది వారి గళం వినిపించే వారి సంఖ్యా తగ్గుతుంది. ఈ రాష్ట్రాల సమస్యల పరిష్కారం పట్ల నిర్లక్ష్యం పెరుగుతంది. కొన్ని రాష్ట్రాలకు సీట్ల సంఖ్యను కుదించాలన్నా, పెంచాలన్నా ఇప్పుడున్న సీట్ల సంఖ్యను అనివార్యంగా పెంచాలి. రాష్ట్రాల సైజు బట్టి సీట్లను పెంచడం కూడా ఆలోచించాలి. లోక్‌సభకు ఎన్నికయ్యే ప్రతినిధుల సంఖ్యను విధిగా పెంచవలసి ఉంటుంది. లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన, 1977లో రాజ్యాంగానికి 42వ సవరణ జరిగింది. లోక్‌సభలో ప్రస్తుతం రాష్ట్రాల నుంచి ఎన్నికైన ప్రతినిధులు 530 మంది, కేంద్ర పాలిత ప్రాంతాల నుంచి 13 మంది ఉన్నారు. అధికరణ 81లోని నిబంధన 2(ఎ) ప్రకారం ప్రతి రాష్ట్రం నుండి లోక్‌సభకు ఎంతమంది ఎన్నిక కావాలనే విషయం ఆ రాష్ట్ర జనాభాపై ఆధారపడి ఉంటుంది. జనాభాకు, లోక్‌సభ సభ్యుల సంఖ్యకు గల నిష్పత్తి సాధ్యమైనంతవరకు అన్ని రాష్ట్రాలకు ఒకే విధంగా ఉంటే పేచీ ఉండదు. ఇకపోతే ప్రధానంగా మరో రాజ్యాంగ సవరణ కూడా చేయాల్సి ఉంది. ఇప్పుడున్న ఎంపిలు, ఎమ్మెల్యేలు వరుసగా వారే ఎన్నికవుతూ వస్తున్నారు.. కలు,ధనబలం ద్వారా ఒక్కరే ఆరేడు పర్యాయాలు సభ్యులుగా ఉంటున్నారు. ఇది పోవాల్సిన అవసరం ఉంది. 140 కోట్లు ఉన్న దేశంలో కొందరే నిరంతరంగా చట్టసభలను గబ్బిలాల్లో పట్టుకుని వెళ్లాడుతున్నారు. ఇందులో అన్ని పార్టీల వారూ ఉన్నారు. ఇది పోతేనే దేశం బాగుపడదు. అలాగే ప్రజాస్వామ్యం బలపడదు. దీనిపై బిజెపి దృష్టి పెట్టాల్సి ఉంది. కనీసం రెండు టర్ములకు మించి ఎన్నిక కాకుండా రాజ్యాంగ సవరణ చేయాలి. మూడో దఫాలో అధికారం చేపట్టిన మోడీ అనేక ఆశలు కల్పించారు. ఇలాంటి సంస్కరణలు చేపడితే ప్రజలు ఆమోదిస్తారు. హర్షిస్తారు. రాజకీయ పార్టీల నేతలు జీవితాంతం చట్టసభల్లో తిష్టవేయకుండా చేస్తే..దేశ ప్రయోజనాలు కాపాడిన వారు అవుతారు. ఇందుకు అన్ని రాజకీయ పార్టీలు తమ సచ్ఛీలతను చాటుకోవాల్సి ఉంది. ముందుగా మోడీ ఇందుకు సిద్ధం కావాలి.

# కెనడా నూతన ప్రధానిగా మార్క్ కార్నీ

## భారత్‌తో సంబంధాలు పునరుద్దణకు పెద్దపీట

**న్యూఢిల్లీ, మార్చి 10:** కెనడా లిబరల్ పార్టీ దేశ తదుపరి ప్రధానమంత్రిగా మార్క్ కార్నీని అత్యధిక మెజారిటీతో ఎన్నుకుంది. జస్టిన్ ట్రూడో స్థానంలో మార్క్ కార్నీని ఎన్నుకున్నారు. తుది లెక్కల ప్రకారం, లిబరల్ పార్టీ నాయకత్వ ఓట్లలో పోలైన బ్యాలెట్లలో కార్నీ 85.9శాతంసాధించి గెలిచారు. జస్టిన్ ట్రూడో స్థానంలో కార్నీ బాధ్యతలు స్వీకరించి, కొంత కాలం మాత్రమే ఆ పదవిలో ఉంటాడు. ఎందుకంటే కెనడాలో అక్టోబర్ నాటికి ఎన్నికలు నిర్వహించాలి. విజయోత్సవ సభలో కార్నీ మాట్లాడుతూ ట్రంప్ నేతృత్వంలోని యునైటెడ్ స్టేట్స్(యుఎస్) కెనడాను నియంత్రణ సాధించేందుకు ప్రయత్నిస్తోందని హెచ్చరించారు. ఈ ప్రయత్నాన్ని తిప్పికొట్టాలని తెలిపారు. యుఎస్ కెనడా వనరులను, నీటిని, భూమిని, దేశాన్ని కోరుకుంటున్నారని తెలిపారు. కెనడియన్ కార్మికులు, కుటుంబాలు, వ్యాపారాలపై ట్రంప్ దాడి చేస్తున్నారని మండిపడ్డారు. మార్క్ కార్నీ భారత్–కెనడా సంబంధాలపై కీలక వ్యాఖ్యలు చేశారు. ట్రూడో అధికారంలో ఉన్న సమయంలో భారత్‌తో దెబ్బతిన్న సంబంధాలను తిరిగి పునరుద్ధరిస్తానన్నారు. తాను అధికారంలోకి వచ్చిన వెంటనే ఆవిధంగా కృషి చేయడానికి ఎదురుచూస్తున్నానని పేర్కొన్నారు. న్యూదిల్లీతోనే కాకుండా సారూప్యత కలిగిన దేశాలతోనూ వాణిజ్య సంబంధాలను బలోపేతం చేయడానికి తగిన చర్యలు తీసుకుంటానని తెలిపారు. భారత్‌పై తన వైఖరిని ఇదివరకే ఓ ఇంటర్వ్యూలో ఆయన స్పష్టంచేసిన విషయం




తెలిసిందే. తాజా వ్యాఖ్యలు ఆయనకు భారత్‌పై ఉన్న సానుకూల ధోరణిని వ్యక్తపరుస్తున్నాయి. దశాబ్దాల తరబడి మిత్రదేశాలుగా ఉన్న భారత్, కెనడాల మధ్య సంబంధాలు ఇటీవల బాగా దెబ్బతిన్నాయి. కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో ( నిరుడు తమ పార్లమెంటులో మాట్లాడుతూ.. ఖలిస్థానీ ఉగ్రవాది హర్‌దీప్ సింగ్ నిజ్జర్ హత్య వెనక భారత్ ఏజెంట్ల హస్తం ఉండొచ్చని చేసిన వ్యాఖ్యలు ఇరుదేశాల మధ్య ఉద్రిక్తతలు రాజేశాయి. భారత్ వెంటనే వాటిని తిప్పికొట్టింది. అనంతరం ఇరుదేశాలు పరస్పరం దౌత్యవేత్తలను తిప్పి పంపివేశాయి. ఆ క్రమంలోనే వరసగా జరిగిన కొన్ని పరిణామాలతో ఉభయదేశాల దౌత్య, వాణిజ్య సంబంధాలు క్షీణించాయి. ఈనేపథ్యంలో కెనడాకు నూతన ప్రధానిగా అధికార లిబరల్ పార్టీ నేత మార్క్ కార్నీ ఎన్నికవ్వడం.. ఆయన భారత్‌కు అనుకూలంగా ఉండడంతో భవిష్యత్తులో ఇరుదేశాల మధ్య సంబంధాలు మెరుగయ్యే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

# ప్రణయ్ హత్య కేసులో నల్గొండ కోర్టు సంచలన తీర్పు

- సుభాష్ శర్మకు ఉరి శిక్ష..
- మిగిలిన వారికి యావజ్జీవ శిక్ష

**నల్గొండ,మార్చి10 :** రెండు తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించిన మిర్యాలగూడ పెరుమాళ్ల ప్రణయ్ హత్య కేసులో తుది తీర్పును సోమవారం నల్లగొండ కోర్టు వెల్లడించింది. ఏ2 సుభాష్ శర్మకు ఉరిశిక్ష విధిస్తూ న్యాయస్థానం సంచలన తీర్పు ఇచ్చింది. నిందితులు అందరికీ యావజ్జీవ కారాగార శిక్ష విధిస్తూ ఎస్సీ, ఎస్టీ సెషన్స్ రెండో అదనపు న్యాయ స్థానం కీలక తీర్పు వెలువరించింది. 302, 120 ఐపీసీ, 109, 1989 సెక్షన్ ఐపీసీ ఇండియన్ ఇండియన్ ఆర్మ్ యాక్ట్ 1959 ప్రకారం శిక్ష విధించింది. శిక్ష తగ్గించాలని న్యాయమూర్తిని ఈ సందర్భంగా నేరస్తులు వేడుకున్నారు. హార్ట్ పెషేంట్, కుటుంబ సభ్యుల ఆరోగ్యం, చిన్న పిల్లలు ఉన్నారని కొందరు నేరస్తులు న్యాయ స్థానానికి తెలిపారు. ఉగ్రవాది అస్గర్ అలీకి సుపారీ.. అయితే ఏ2 సుభాష్ శర్మకు నల్గొండ కోర్టు ఉరిశిక్ష విధించింది. ప్రణయ్ హత్యలో సుభాష్ శర్మ కీలకపాత్ర పోషించాడు. సుభాష్ శర్మకు ఉరిశిక్ష విధిస్తూ నల్గొండ కోర్టు తీర్పు వెలువరించింది. ఇప్పటికే జైల్లో ముగ్గురు నిందితులు శిక్ష అనుభవిస్తున్నారు. ఉగ్రవాది అస్గర్ అలీకి సుపారీ ఇచ్చి ప్రణయ్‌ను అమృత తండ్రి హత్య చేయించాడు. ఏడుగురితో ఓ గ్యాంగ్‌ను అస్గర్ అలీ ఏర్పాటు చేశాడు. గుజరాత్ మాజీ



హెూంమంత్రి హరెన్ పాండ్యా హత్య కేసులో నిందితులతో కలిపి అస్గర్ అలీ గ్యాంగ్ ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. కాగా.. పెరుమాళ్ల ప్రణయ్ హత్యకేసులో నల్లగొండ ఎస్సీ, ఎస్టీ జిల్లా సెషన్‌కోర్టు కీలక తీర్పు వెలువరించింది. 2018 సెప్టెంబర్ 14వ తేదీన హత్యకు ప్రణయ్ గురయ్యాడు. గర్భవతిగా ఉన్న భార్య అమృతను నల్లగొండ జిల్లా మిర్యాలగూడలోని ఆస్పత్రికి తీసుకువెళ్లి.. తిరిగి వస్తుండగా.. దుండగులు ప్రణయ్‌పై కత్తులతో దాడి చేసి హతమార్చారు. తన కూతురిని కులాంతర వివాహం చేసుకున్నాడనే కక్షతో సుఫారీ గ్యాంగ్‌తో ప్రణయ్‌ను మారుతీరావు హత్య చేయించాడు. ఈ కేసును ప్రతిష్టాత్మకంగా తీసుకున్న పోలీసుశాఖ అన్ని కోణాల్లో విచారణ పూర్తిచేసి 1600పేజీల్లో చార్జిషీట్ నివేదికను రూపొందించింది. అప్పటి ఎస్పీ ఏవీ రంగనాథ్ పర్యవేక్షణలో విచారణ పూర్తిచేసి హత్యకేసుల్లో ఎనిమిది మంది నిందితుల పాత్ర ఉందని నిర్ధారించి, 2019 జూన్ 12 వ తేదీన చార్జిషీట్ దాఖలు చేయగా నల్లగొండ ఎస్సీ, ఎస్టీ జిల్లా సెషన్ కోర్టు విచారణ మొదలుపెట్టింది. సుమారు 5సంవత్సరాల 9నెలల కాలం పాటు విచారణ కొనసాగగా, పోలీస్ శాఖ సమర్పించిన చార్జిషీట్ నివేదిక, పోస్టుమార్టం రిపోర్టు, సైంటిఫిక్ ఎవిడెన్స్‌లతో పాటు సాక్షులను న్యాయస్థానం విచారించి తుది తీర్పును ఈరోజు రిజర్వు చేసింది. ప్రణయ్ హత్యకేసులో ఏ1 తిరునగరు మారుతీరావు, ఏ2 బీహార్‌కు చెందిన సుభాష్‌శర్మ, ఏ3 అజ్గర్‌అలీ, ఏ4 అబ్దుల్‌బారీ, ఏ5 ఎం.ఏ కరీం, ఏ6 తిరునగరు శ్రవణ్‌కుమార్, ఏ7 శివ, ఏ8 నిజాం నిందితులుగా పోలీసులు కోర్టుకు సమర్పించిన చార్జిషీట్‌లో పేర్కొన్నారు. ప్రధాన నిందితుడు మారుతీరావు(ఏ–1) 2020 మార్చిలో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ కేసులో నిందితుల పాత్రపై సాక్ష్యాధారాలను పరిగణించి శిక్ష ఖరారు చేస్తూ న్యాయస్థానం వెల్లడించింది. సుభాష్‌శర్మ (ఏ–2), అస్గర్‌అలీ(ఏ–3) విచారణ ఖైదీలుగా ఉన్నారు. మిగిలిన ఐదుగురు నిందితులు బెయిల్‌పై విడుదలై కోర్టు విచారణకు హాజరవుతున్నా విషయం తెలిసిందే.

# ఇంటర్నేషనల్ డ్రగ్ డీలర్ షెహనాజ్ సింగ్ అరెస్ట్

## వెల్లడించిన పంజాబ్ డీజీపీ

**చండీఢఘడ్, మార్చి 10 :** అమెరికా సహా పలు దేశాలకు మాదక ద్రవ్యా లను సరఫరా చేస్తున్న అంత ర్జాతీయ డ్రగ్ డీలర్‌ను పంజా బ్ పోలీసులు పట్టుకున్నారు. ఎఫ్‌బీఐ మోస్ట్‌వాంటెడ్ జాబితాలో ఉన్న ఇంటర్నేషనల్ డ్రగ్ లార్డ్ షెహనాజ్ సింగ్ అలియాస్ షాన్ భిండెర్‌ను అరెస్టు చేసినట్లు పంజాబ్ డీజీపీ సామాజిక మాధ్యమాల్లో ప్రకటించారు. నార్కోటిక్స్ సిండికేట్‌లో అతడు కీలకంగా వ్యవహరిస్తున్నాడని, కొలంబియా నుంచి అమెరికా, కెనడాలోకి మాదకద్రవ్యాలను స్మగ్లింగ్ చేస్తున్నట్లు గుర్తించామని తెలిపారు. షెహనాజ్ అక్రమాలపై ప్రత్యేక నిఘా పెట్టిన అమెరికా ఎఫ్‌బీఐ ఫిబ్రవరి 26న అతడి



అనుచరులను అరెస్టు చేసింది. వారినుంచి 391 కేజీల మెథంఫెటమైన్, 109 కేజీల కొకైన్ సహా నాలుగు ఆయుధాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ పరిణామాలతో షెహనాజ్ భారత్‌కు పారిపోయి వచ్చాడు. దానిపై నిఘా వర్గాల నుంచి సమాచారం రావడంతో పంజాబ్ తర్న్ తరణ్ పోలీసులు రహస్య ఆపరేషన్ చేపట్టారు. అతడి జాడను గుర్తించి తాజాగా అరెస్టు చేసినట్లు డీజీపీ వెల్లడించారు. మాదకద్రవ్యాల అక్రమ రవాణా, వ్యవస్థీకృత నేరాల కట్టడికి తాము కఠిన చర్యలు తీసుకుంటున్నామని చెప్పేందుకు ఆ ఆపరేషన్ నిదర్శనమని పంజాబ్ పోలీసులు వెల్లడించారు. డ్రగ్ స్మగ్లర్లు, క్రిమినల్స్‌కు పంజాబ్ స్వర్గధామం కాదని హెచ్చరించారు.

# మిలియన్ మార్చ్‌కు 14 ఏళ్లు

## నాటి పరిస్థితులను గుర్తుచేసుకున్న కేటీఆర్, హరీశ్‌రావు

**హైదరాబాద్, మార్చి 10:** తెలంగాణ మలిదశ ఉద్యమంలో అత్యంత కీలకమైన ఘట్టాల్లో ఒకటైన మిలియన్ మార్చ్‌కు నేటితో 14 ఏళ్లు పూర్తి అయిన నేపథ్యంలో బీఆర్‌ఎస్ నేతలు కేటీఆర్, హరీశ్‌రావు నాటి సందర్భాన్ని గుర్తుచేసుకున్నారు. అప్పటి కాంగ్రెస్ పాలకుల ఆంక్షలకు తట్టుకొని.. నిర్బంధాలకు ఎదురొడ్డి.. అరెస్టులను ఎదురించి.. లక్షలాది తెలంగాణ ఉద్యమకారులు తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ట్యాంక్ బండ్‌పై గర్జించిన అపురూప సన్నివేశాలు ఇప్పటికీ కళ్ళ ముందు మెదులుతున్నాయని కేటీఆర్ అన్నారు. తెలంగాణ ఉద్యమంలో వివిధ పోరాట రూపాల్లో ప్రత్యక్షంగా, పరోక్షంగా పాల్గొన్న ప్రతీ ఒక్కరికీ కేటీఆర్ ధన్యవాదాలు తెలిపారు. తెలంగాణ అమరవీరులకు జోహార్.. జై తెలంగాణ అని వ్యాఖ్యానించారు. 'మిలియన్ మార్చ్'తో తెలంగాణ ఉద్యమం ఉవ్వెత్తున ఎగసిపడ్డ సందర్భమని హరీశ్‌రావు అన్నారు. ఆంక్షల పద్మవ్యూహాన్ని బద్దలుకొట్టుకుని లక్షలాదిగా జనం తరలివచ్చారని గుర్తుచేసుకున్నారు. స్వరాష్ట్ర సాధన కోసం ఉవ్వెత్తున ఎగసిన ఉద్యమ ప్రస్థానంలో అదో కీలక ఘట్టమని వ్యాఖ్యానించారు. ప్రపంచ ప్రజా ఉద్యమాల సరసన తెలంగాణ ఉద్యమాన్ని నిలిపిన అసలు సిసలు ప్రజా విప్లవమని అన్నారు. ఆంక్షలు, నిర్బంధాల కట్టడిని చిత్తడి చేసి జలమార్గం గుండా టాంక్ బండ్ చేరుకొని, మిలియన్ మార్చ్ లో పాల్గొని నేటికీ 14 ఏళ్లు పూర్తయ్యాయని అన్నారు. ఆ అపురూప దృశ్యాలు ఇప్పటికీ కళ్ళ ముందు కదలాడుతున్నాయని చెప్పారు. నాటి ఉద్యమ పోరాటాలు ఇంకా రగిలిస్తూనే ఉన్నాయని అన్నారు. స్వరాష్ట్ర సాధన కోసం కేసీఆర్ గారి నాయకత్వంలో తెలంగాణ ప్రజలు చూపిన తెగువకు, పోరాటానికి సెల్యూట్ అని అన్నారు. ప్రాణాలు సైతం అర్పించిన అమరులకు జోహార్ తెలిపారు.

# పార్టీకి దోహ్రం చేస్తున్నారని మావోయిస్టుల లేఖ

## అటవీ సంపదను దోచుకునేందుకే ఆపరేషన్ కగార్

**ఛత్తీస్‌గడ్, మార్చి 10:** అటవీ సంపదను కేంద్ర ప్రభుత్వం దోచుకునేందుకు ఆపరేషన్ కగార్‌ను తీసుకొచ్చిందని మావోయిస్టులు విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సౌత్ బస్తర్ డీ.వీ.సీ.ఏం సభ్యు డు మొడీయం దినేష్ అతని భార్య కళ పార్టీ డబ్బుతో పారిపోయి పోలీసులకు లొంగిపోయారు. ఇరవై ఏళ్ల ఉద్యమ జీవితంలో ఉన్న దినేష్ పార్టీకి ద్రోహం చేశారని మావోయిస్టులు లేఖలో ప్రస్తావించారు. తీవ్రమైన అణచివేతకు గురైన వారు శత్రువుకు లొంగిపోతారని మావోయిస్టులు తెలిపారు. త్యాగాలను స్ఫూర్తిగా తీసుకుని 'ఆపరేషన్ కగార్' యుద్ధాన్ని అడ్డుకుంటామని హెచ్చరించారు. సౌత్ సబ్ జోనల్ బ్యూరో పేరుతో మావోయిస్టులు లేఖ విడుదల చేశారు. కాగా.. దండకారణ్యం, ఛత్తీస్‌గఢ్ అడవుల్లో కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ కగార్ నిలిపివేయాలని గత కొంత కాలంగా మావోయిస్టులు కోరుతున్న విషయం తెలిసిందే. దండకారణ్యంలో ఆపరేషన్ కగార్ పేరిట మావోయిస్టులను, ఆదివాసీలను కేంద్ర ప్రభుత్వం హత మారుస్తోందని, రాష్ట్ర ప్రభుత్వాలు జోక్యం చేసుకోవాలని మావోయిస్టులు డిమాండ్ చేశారు. అడవుల్లో జీవిస్తున్న ఆదివాసీలను వెళ్లగొట్టడానికి కేంద్ర ప్రభుత్వం కుట్రలు చేస్తుందని, అడవుల్లో ఆదివాసీలకు మావోయిస్టులు అండ అని అన్నారు. ఆదివాసీలను లేకుండా చేసి అడవుల్లో ఉన్న అపారమైన ఖనిజ సంపదను బహుళజాతి సంస్థలకు అమ్ముకోవడానికి కేంద్ర ప్రభుత్వం చూస్తోందని, దీనిని ప్రజలు, మేధావులు తిప్పికొట్టాలని మావోయిస్టులు పిలుపునిచ్చారు.

## పంజాబ్ పోలీసులకు చిక్కిన
# ఇంటర్నేషనల్ డ్రగ్ లార్డ్



**న్యూఢిల్లీ :** అమెరికా సహా పలు దేశాలకు మాదక ద్రవ్యాలను సరఫరా చేస్తున్న అంతర్జాతీయ డ్రగ్ డీలర్‌ను పంజాబ్ పోలీసులు పట్టుకున్నారు. ఎఫ్‌బీఐ మోస్ట్‌వాంటెడ్ జాబితాలో ఉన్న ఇంటర్నేషనల్ డ్రగ్ లార్డ్ షెహనాజ్ సింగ్ అలియాస్ షాన్ భిందెర్‌ను అరెస్టు చేసినట్లు పంజాబ్ డీజీపీ సామాజిక మాధ్యమాల్లో ప్రకటిం చారు. నార్కోటిక్స్ సిండికేట్‌లో అతడు కీలకంగా వ్యవహరిస్తున్నాడని, కొలంబియా నుంచి అమెరికా, కెనడాలోకి మాదకద్రవ్యాలను స్మగ్లింగ్ చేస్తున్నట్లు గుర్తించామని తెలిపారు. షెహనాజ్ అక్రమాలపై ప్రత్యేక నిఘా పెట్టిన అమెరికా ఎఫ్‌బీఐ ఫిబ్రవరి 26న అతడి అనుచరులను అరెస్టు చేసింది. వారినుంచి 391 కేజీల మెథంఫెటమైన్, 109 కేజీల కొకైన్ సహా నాలుగు ఆయుధాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ పరిణామాలతో షెహనాజ్ భారత్‌కు పారిపోయి వచ్చాడు. దానిపై నిఘా వర్గాల నుంచి సమాచారం రావడంతో పంజాబ్ తర్న్ తరణ్ పోలీసులు రహస్య ఆపరేషన్ చేపట్టారు. అతడి జాడను గుర్తించి తాజాగా అరెస్టు చేసినట్లు డీజీపీ వెల్లడించారు. మాదకద్రవ్యాల అక్రమ రవాణా, వ్యవస్థీకృత నేరాల కట్టడికి తాము కఠిన చర్యలు తీసుకుంటున్నామని చెప్పేందుకు ఆ ఆపరేషన్ నిదర్శనమని పంజాబ్ పోలీసులు వెల్లడించారు. డ్రగ్ స్మగ్లర్లు, క్రిమినల్స్‌కు పంజాబ్ స్వర్గధామం కాదని హెచ్చరించారు.

## విమానం గగనతలంలో ఉండగా
# బాంబు బెదిరింపులు




**ముంబయి :** ఎయిరిండియా విమానానికి బాంబు బెదిరింపు వచ్చింది. దాంతో ముంబయి నుంచి న్యూయార్క్ వెళ్తున్న విమానాన్ని పైలట్లు టేకాఫ్ అయిన చోటే దింపారు. జాతీయ మీడియా కథనాల ప్రకారం.. బోయింగ్ 777 విమానం ముంబయి నుం చి న్యూయార్క్ వెళ్తోంది. నాలుగు గంటల తర్వాత అజర్‌బైజన్ ప్రాంతంలో గగనతలంలో ఉండగా బెదిరింపులు వచ్చాయి. సిబ్బంది వెంటనే అప్రమత్తమై పైలట్లకు తెలపడంతో వారు ముంబయి వైపు విమానాన్ని మళ్లించారు. అక్కడ ల్యాండ్ అయిన వెంటనే బాంబ్ డిటెక్షన్ స్క్వాడ్ రంగంలోకి దిగి, తనిఖీలు చేపట్టింది. అది నకిలీ కాల్ అని తెలుస్తోంది. విమానంలో సిబ్బందితో కలిపి 322 మంది ప్రయాణికులున్నారు. తనిఖీల అనంతరం మంగళవారం తెల్లవారుజామున తిరిగి న్యూయార్క్ బయల్దేరనున్నట్లు ఎయిరిండియా వెల్లడించింది. గత డిసెంబర్‌లో అజర్ బైజన్ ఎయిర్‌లైన్స్‌కు చెందిన జె2-8243 విమానం ప్రమాదానికి గురికావడంతో 38 మంది ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. బాకు నుంచి రష్యాలోని చెచెన్ ప్రాంతానికి చెందిన గ్రోజ్నికి ప్రయాణిస్తుండగా కజకిస్థాన్‌లోని అక్టౌలో అది కూలిపోయింది. రష్యా క్షిపణి తాకడం వల్ల విమానం కూలిందంటూ అప్పట్లో ఆరోపణలు వచ్చిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో తాజాగా జరిగిన ఈ ఘటన ఆందోళన కలిగించింది. ఇక ఇటీవల ఎయిరిండియా తరచూ వార్తల్లో నిలుస్తోంది. విమానాశ్రయంలో ఓ వృద్ధురాలికి వీల్‌ఛైర్ సదుపాయం కల్పించకపోవడంతో నడుచుకుంటూ వెళ్లిన ఆమె కిందపడిపోవడంతో తీవ్ర గాయాలయ్యాయి. తాము బుక్ చేసుకున్నప్పటికీ.. ఎయిరిండియా సిబ్బంది ఛైర్ ఇవ్వలేదని ఆమె బంధువులు ఆరోపించారు. ఇక షికాగో నుంచి దిల్లీకి బయల్దేరిన విమానంలో టాయిలెట్లు మూసుకుపోవడంతో.. 10 గంటల ప్రయాణం అనంతరం విమానం వెనక్కి మళ్లిన సంగతి తెలిసిందే.

## మాజీ సీఎం కుమారుడి నివాసంలో ఈడీ సోదాలు



**ఛత్తీస్‌గఢ్ :** ఛత్తీస్‌గఢ్ మాజీ సీఎం భూపేశ్ భగేల్ కుమారుడు చైతన్య నివాసంలో సోమవారం ఈడీ సోదాలు నిర్వహించింది. మద్యం కుంభకోణానికి సంబంధించిన మనీలాండరింగ్ కేసులో భాగంగా ఈ తనిఖీలు జరిగాయని సంబంధిత అధికారులు వెల్లడించారు. మొత్తం 15 ప్రాంగణాల్లో సోదాలు జరిగాయి. వాటిలో భిలాయి ప్రాంతంలో ఉన్న చైతన్య భగేల్ నివాసం కూడా ఉంది. ఈ తనిఖీల నేపథ్యంలో భగేల్ కార్యాలయం నుంచి స్పందన వచ్చింది. "ఏడు సంవత్సరాలు నడిచిన తప్పుడు కేసును కోర్టు కొట్టివేసింది. కానీ ఇప్పుడు ఈడీ అతిథులు వచ్చి భగేల్ నివాసంలో తనిఖీలు చేశారు" అని మండిపడింది. ఛత్తీస్‌గఢ్ మద్యం కుంభకోణంతో రాష్ట్ర ఖజానాకు భారీ నష్టం వాటిల్లిందని ఆరోపణలు ఉన్నాయి. మద్యం సిండికేట్‌కు రూ.రెండువేల కోట్ల మేర లబ్ధి చేకూరిందని ఈడీ గతంలో పేర్కొంది. దర్యాప్తులో భాగంగా రాష్ట్ర ప్రభుత్వ అధికారులతో పాటు వ్యాపారవేత్తలను అరెస్టు చేసింది.



## జాతీయ విద్యా విధానంపై ఆందోళన

**న్యూఢిల్లీ :** కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జాతీయ విద్యా విధానాన్ని తమిళనాడు అధికార పార్టీ డీఎంకే వ్యతిరేకిస్తున్న సంగతి తెలిసిందే. తాజాగా ఈ అంశాన్ని లోక్‌సభలో డీఎంకే ఎంపీలు లేవనెత్తడంతో గందరగోళ వాతావరణం నెలకొంది. ఎంపీల చర్యపై స్పందించిన కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ మండిపడ్డారు. దీంతో స్పీకర్ ఓం బిర్లా సభను వాయిదా వేసి.. తిరిగి ప్రారంభించారు. కొత్త విద్యా విధానాన్ని తమిళనాడులో అమలుచేయడంపై డీఎంకే ఎంపీలు నిరసిస్తూ వెల్ వైపు వెళ్లడంతో కేంద్రమంత్రి ఆగ్రహం వ్యక్తంచేశారు. జాతీయ విద్యావిధానంపై చేసిన ఆరోపణలను ఆయన తిప్పికొట్టారు. "విద్యార్థుల భవిష్యత్తుతో డీఎంకే చెలగాటమాడుతోంది. వారంతా నిజాయతీ లేనివారు. విద్యార్థులకు బంగారు భవిష్యత్తు ఇచ్చేందుకు డీఎంకే సిద్ధంగా లేదు. భాష పరమైన వివాదాలు సృష్టించడమే వారు పనిగా పెట్టుకున్నట్లున్నారు. రాజకీయాలు చేస్తున్నారు. వారి చర్యలు ప్రజాస్వామ్య వ్యతిరేకం" అని ఆరోపించారు.

### ఓటరు జాబితాపై చర్చ జరగాలి: రాహుల్

ఈక్రమంలోనే స్పీకర్ సభను వాయిదా వేసి తిరిగి ప్రారంభించారు. ప్రధాన్ వ్యాఖ్యలపై డీఎంకే నిరసన వ్యక్తంచేసింది. అనంతరం ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ మాట్లాడారు. ఓటరు జాబితాలో అవకతవకలు జరిగాయన్న అంశాన్ని ఆయన లేవనెత్తారు. దీనిపై దేశవ్యాప్తంగా ఆందోళనలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. "ఓటరు జాబితాపై దేశవ్యాప్తంగా ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఈ జాబితాపై చర్చలు జరగాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేస్తున్నాయి" అని కాంగ్రెస్ అగ్రనేత పేర్కొన్నారు.

## భారత్‌తో సంబంధాలు
# మెరుగుపరచుకుంటాం : కెనడా




**కెనడా :** కెనడా అధికార లిబరల్ పార్టీ నూతన నేతగా ఎన్నికయిన మార్క్ కార్నీ భారత్-కెనడా సంబంధాలపై కీలక వ్యాఖ్యలు చేశారు. ట్రూడో అధికారంలో ఉన్న సమయంలో భారత్‌తో దెబ్బతిన్న సంబంధాలను తిరిగి పునరుద్ధరిస్తానన్నారు. తాను అధికారంలోకి వచ్చిన వెంటనే ఆవిధంగా కృషి చేయడానికి ఎదురుచూస్తున్నానని పేర్కొన్నారు. న్యూదిల్లీతోనే కాకుండా సారూప్యత కలిగిన దేశాలతోనూ వాణిజ్య సంబంధాలను బలోపేతం చేయడానికి తగిన చర్యలు తీసుకుంటానని తెలిపారు. భారత్‌పై తన వైఖరిని ఇదివరకే ఓ ఇంటర్వ్యూలో ఆయన స్పష్టంచేసిన విషయం తెలిసిందే. తాజా వ్యాఖ్యలు ఆయనకు భారత్‌పై ఉన్న సానుకూల ధోరణిని వ్యక్తపరుస్తున్నాయి. దశాబ్దాల తరబడి మిత్రదేశాలుగా ఉన్న భారత్, కెనడాల మధ్య సంబంధాలు ఇటీవల బాగా దెబ్బతిన్నాయి. కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో నిరుడు తమ పార్లమెంటులో మాట్లాడుతూ.. ఖలిస్థానీ ఉగ్రవాది హర్‌దీప్ సింగ్ నిజ్జర్ హత్య వెనక భారత్ ఏజెంట్ల హస్తం ఉండొచ్చని చేసిన వ్యాఖ్యలు ఇరుదేశాల మధ్య ఉద్రిక్తతలు రాజేశాయి. భారత్ వెంటనే వాటిని తిప్పికొట్టింది. అనంతరం ఇరుదేశాలు పరస్పరం దౌత్యవేత్తలను తిప్పి పంపివేశాయి. ఆ క్రమంలోనే వరసగా జరిగిన కొన్ని పరిణామాలతో ఉభయదేశాల దౌత్య, వాణిజ్య సంబంధాలు క్షీణించాయి. ఈనేపథ్యంలో కెనడాకు నూతన ప్రధానిగా అధికార లిబరల్ పార్టీ నేత మార్క్ కార్నీ ఎన్నికవ్వడం.. ఆయన భారత్‌కు అనుకూలంగా ఉండడంతో భవిష్యత్తులో ఇరుదేశాల మధ్య సంబంధాలు మెరుగయ్యే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

## లలిత్ మోదీకి షాక్.. వనాటు పౌరసత్వం రద్దు?



**ముంబయి :** ప్రపంచంలోనే అత్యంత సంపన్న క్రికెట్ లీగ్ అయిన ఐపీఎల్ వ్యవస్థాపకుడు, మాజీ ఛైర్మన్ లలిత్ మోదీ పసిఫిక్ ద్వీప దేశమైన వనాటుకు మకాం మార్చేస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి. దీనికోసం ఆ దేశానికి చెందిన గోల్డెన్ పాస్‌పోర్టును తీసుకున్నట్లు సమాచారం. కాగా ఆయనకు జారీ చేసిన పౌరసత్వాన్ని రద్దు చేయాలని వనాటు ప్రధాని జోథం నపాట్ పౌరసత్వ కమిషన్‌ను ఆదేశించినట్లు అధికారులు వెల్లడించారు. "దరఖాస్తు సమయంలో నిర్వహించిన ఇంటర్‌పోల్ స్క్రీనింగ్‌లతో సహా అన్ని ప్రామాణిక నేపథ్య తనిఖీలలో లలిత్ మోదీపై ఎటువంటి నేరారోపణలు లేవని తేలింది. అయితే గత 24 గంటల్లో ఆయనపై హెచ్చరిక నోటీసు జారీ చేయాలని భారత అధికారులు ఇంటర్‌పోల్‌కు రెండుసార్లు అభ్యర్థనలు చేసినట్లు మాకు తెలిసింది. అయితే తగిన ఆధారాలు లేనందువల్ల వారి అభ్యర్థనలను ఇంటర్‌పోల్ తిరస్కరించింది. వనాటు పౌరసత్వం పొందడానికి చట్టబద్ధమైన కారణాలు ఉండాలి. స్వదేశంలో దర్యాప్తును తప్పించుకోవడానికి అతడు వనాటు పౌరసత్వం తీసుకున్నాడని తెలుస్తోంది. అతడు చూపిన కారణం చట్టబద్ధంగా లేకపోవడంతో లలిత్ పౌరసత్వం రద్దు చేయాలని నిర్ణయించుకున్నాం" అని వనాటు ప్రధాని పేర్కొన్నారు. లలిత్ మోదీ వనాటు పౌరసత్వం తీసుకున్న నేపథ్యంలో తన భారత పాస్‌పోర్టును అప్పగించేందుకు లండన్‌లోని రాయబార కార్యాలయంలో ఇటీవల దరఖాస్తు చేసుకున్నాడు. దీనిపై విదేశాంగ మంత్రిత్వశాఖ స్పందిస్తూ.. దానిని నిబంధనల ప్రకారం అధికారులు పరిశీలిస్తున్నారని పేర్కొంది. అతడిపై ఉన్న కేసును చట్ట ప్రకారం కొనసాగిస్తామని తెలిపింది. లలిత్ మోదీ ఐపీఎల్‌కు బాస్‌గా ఉన్న సమయంలో కోట్లాది రూపాయలు దుర్వినియోగం చేశాడని అతడిపై ఆరోపణలు ఉన్నాయి. దీంతో భారత అధికారులకు దొరకకుండా గత 15 ఏళ్లుగా లండన్‌లో తల దాచుకున్నాడు. అతడిని తిరిగి స్వదేశానికి తప్పించేందుకు భారత్ ప్రయత్నాలు చేస్తున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో లలిత్ పసిఫిక్ ద్వీప దేశమైన వనాటుకు మకాం మార్చడానికి సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. ఎందుకంటే వనాటులో వ్యాపార సంస్థను రిజిస్టర్ చేసుకొని.. దేశం బయటి నుంచి ఆదాయాన్ని పొందినా, ఎలాంటి ఇబ్బందీ ఉండదు. అలాగే గిఫ్ట్ , ఎస్టేట్ ట్యాక్స్‌లు లేవు. అంతేగాకుండా ఆ దేశం క్రిప్టో హబ్‌గా వృద్ధి చెం దుతోంది. స్థానికంగా, అంతర్జాతీయంగా వచ్చే ఆదాయంతో సంబంధం లేకుండా దేనిపైనా అక్కడ ఆదాయపన్ను ఉండదు. దీర్ఘకాలిక లాభాలపై పన్ను కూడా ఉండదు. ముఖ్యంగా స్టాక్స్, రియల్ ఎస్టేట్ వంటి వ్యాపారాలు చేసేవారికి ప్రయోజనకరంగా ఉంటుంది.


## కెనడా ఎన్నటికీ అమెరికాలో భాగం కాబోదు

### మార్క్ కార్నీ




**కెనడా :** కెనడాలో అధికార లిబరల్ పార్టీ నేతగా మార్క్ కార్నీ ఎన్నికయ్యారు. దీంతో తదుపరి ప్రధానిగా ఆయన బాధ్యతలు చేపట్టనున్నారు. ఈ నేపథ్యంలో ఓ మీడియా సమావేశంలో ప్రసంగిస్తూ.. కెనడాను తమ దేశంలో 51వ రాష్ట్రంగా చేర్చుకుంటామని పలు సందర్భాల్లో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన బెదిరింపులపై స్పందించారు. ఒట్టావా ఏవిధంగానూ.. ఏరూపంలోనూ అమెరికాలో భాగం కాదని ఆయన వ్యాఖ్యానించారు. తమ దేశం అప్పటికీ, ఇప్పటికీ బలంగా ఉందన్నారు. వాణిజ్యం అయినా, క్రీడలు అయినా చివరికి విజయం సాధించేది కెనడాయేనని అని పేర్కొన్నారు. "కెనడాను తమలో కలుపుకొని.. దేశంలో ఉన్న వనరులు, నీరు, భూమి వంటి వాటిని తమ స్వాధీనం చేసుకోవాలనే ఉద్దేశంతో అగ్రరాజ్యం ఉంది. ఈ విషయంలో వారు విజయం సాధిస్తే, మన జీవన విధానాన్ని పూర్తిగా నాశనం చేస్తారు. కాబట్టి ట్రంప్‌ను ఎప్పటికీ ఈ విషయంలో విజయం సాధించనివ్వను. వాషింగ్టన్ ఒట్టావాతో స్వేచ్ఛ, న్యాయమైన వాణిజ్యంపై విశ్వసనీయమైన నిబద్ధత చూపించేవరకు అమెరికాపై ప్రతీకార చర్యలు కొనసాగుతాయి" అని కార్నీ అన్నారు. కెనడాను అంధకారంలో తోయడానికి ప్రయత్నించినందుకు గాను అక్కడి ప్రజలు ఇకపై ఎప్పటికీ అమెరికాను నమ్మరని కార్నీ పేర్కొన్నారు. ఇప్పుడే అగ్రరాజ్యం ఇచ్చిన షాక్ నుంచి తాము బయటపడుతున్నామని.. కానీ ఈ పాఠాలను తామెన్నటికీ మర్చిపోమని అన్నారు. రాబోయే కఠినమైన రోజుల్లో నాయకులు, ప్రజలు ఒకరికి ఒకరు సహకరించుకుంటూ, కలిసికట్టుగా ముందుకుసాగాలని పిలుపునిచ్చారు. అందరి సహకారంతోనే కెనడా సంక్షోభాలను అధిగమిస్తుందని అన్నారు. అమెరికా అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన అనంతరం కెనడా, మెక్సికోలపై 25 శాతం సుంకం విధించే ఆర్డర్లపై డొనాల్డ్ ట్రంప్ సంతకం చేశారు. అంతేకాక వలసలు, డ్రగ్స్ అక్రమ రవాణాను సరిహద్దుల్లోనే కట్టడి చేయడంలో విఫలమైతే అమెరికాలో 51వ రాష్ట్రంగా కెనడా చేరాలని ట్రూడోకు చురకలు అంటించారు. ఈ సుంకాల విధింపును నెల రోజుల పాటు నిలిపివేయగా.. తాజాగా మార్చి 4 నుంచి ఇవి అమల్లోకి వచ్చాయి. దీనికి ప్రతిగా ట్రూడో సైతం ప్రతీకార సుంకాలు ప్రకటించారు. అతడి తీరుపై సొంత పార్టీ నుంచి వ్యతిరేకత రావడంతో తన పదవి నుంచి వైదొలగుతున్నట్లు జనవరిలో ప్రకటించారు. తాజాగా నిర్వహించిన ఎన్నికల్లో అధికార లిబరల్ పార్టీ నేతగా మార్క్ కార్నీ ఎన్నికయ్యారు.

# సిరియాలో ప్రతీకార హత్యలు



**సిరియా :** సిరియాలో అంతర్యుద్ధం తీవ్ర స్థాయిలో జరుగుతున్నట్లు నివేదికలు వస్తున్నాయి. గత 48 గంటల్లోనే 745 ప్రతీకార హత్యలు చోటుచేసుకొన్నాయి. చాలా ప్రాంతాల్లోని మైనార్టీలైన అలావైట్లను అణచివేసే దిశగా ఈ దాడులు జరుగుతున్నాయి. గురువారం అసద్ మద్దతుదారులపై హెచ్‌టీఎస్ ప్రభుత్వానికి అనుకూల సాయుధులు దాడులు చేయడంతో ఘర్షణలు మొదలయ్యాయి. ఈక్రమంలో అసద్ మద్దతుదారులను వెతికి మరీ చంపుతున్నట్లు ఓ బాధితుడు వెల్లడించాడు. వీధుల్లో శవాలు పడి ఉన్నాయని.. మగవారిని ఇళ్ల పైకప్పు మీదకు చేర్చి కాల్చేస్తున్నారని ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. బనియాస్ అనే ప్రాంతంలో రోహిబ్ కమెల్ అనే వ్యక్తి కుటుంబంతో కలిసి బాత్రూమ్‌లో దాక్కొని ప్రాణాలు కాపాడుకొన్నాడు. ఈ విషయాన్ని అతడే ఓ ఆంగ్ల వార్తా సంస్థకు వెల్లడించాడు. "మా పొరుగు వారిపై సాయుధ మిలిటెంట్లు దాడులు చేస్తుండటంతో.. మేము లైట్లు ఆర్పేసి.. దాక్కొన్నాము. వీధుల్లో మృతదేహాలున్నాయి. ఈ పిల్లలు ఏం తప్పు చేశారు. అసద్ పాలన అంతం కావడానికి వీరు కూడా మద్దతు పలికారు" అని కమెల్ వెల్లడించాడు. ఇక సమీర్ హైదర్ అనే బాధితుడు మాట్లాడుతూ తన ఇంటిలోకి సాయుధులు చొచ్చుకొచ్చి తన ఇద్దరు సోదరులు, అల్లుడిని హత్య చేసినట్లు వెల్లడించాడు. వాస్తవానికి అతడు అలావైట్ వర్గానికి చెందినా.. సుదీర్ఘకాలంగా అసద్‌ను వ్యతిరేకిస్తూ వచ్చాడు. దాదాపు పదేళ్లు జైల్లో గడిపాడు. ఇక రేవు నగరమైన లటాకియాలో పరిస్థితి ఘోరంగా ఉంది. అక్కడ ప్రభుత్వ సాంస్కృతిక కేంద్రం అధిపతి యాసిర్ సబౌహ్‌ను గుర్తుతెలియని దుండగులు కాల్చి చంపారు. అతడి ఇంటి ఎదుటే మృతదేహాన్ని పడేశారు. ఈ తీర ప్రాంత నగరంలో అలావైట్లు అత్యధికంగా ఉంటారు. ప్రస్తుతం అక్కడే అత్యధిక హింస చోటుచేసుకుంటోంది. మొత్తంగా మార్చి 6 నుంచి ఈ హింసలో 973 మంది ప్రాణాలు కోల్పోయినట్లు సిరియన్ అబ్జర్వేటరీ ఫర్ హ్యూమన్ రైట్స్ వెల్లడించింది. మరోవైపు దేశంలో తాజాగా చెలరేగిన హింసపై దర్యాప్తు చేస్తామని ఆ దేశ తాత్కాలిక అధ్యక్షుడు అహ్మద్ అల్‌షారా ఓ వీడియో సందేశంలో పేర్కొన్నారు. అదే సమయంలో అసద్ వర్గానికి చెందినవారు, విదేశీ శక్తుల కారణంగానే ఈ పరిస్థితి తలెత్తిందని ఆరోపించారు. ప్రస్తుతం తాము సంక్లిష్ట పరిస్థితిలో ఉన్నామన్నారు. సరికొత్త ముప్పును తాము ఎదుర్కొంటున్నామన్నారు. తమ దేశాన్ని అంతర్యుద్ధం దిశగా లాగుతున్నారన్నారు.

# జెలెన్‌స్కీకి కృతజ్ఞత లేదు : ట్రంప్




**ఫ్లోరిడా :** తమ దేశం నుంచి వందల బిలియన్ల డాలర్లు తీసుకొన్నా ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీకి కృతజ్ఞత లేదని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి విరుచుకుపడ్డారు. ఫాక్స్ న్యూస్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. చాక్లెట్ లాక్కొన్నంత తేలిగ్గా అమెరికా నుంచి సొమ్మును జెలెన్‌స్కీ తీసుకొన్నట్లు అభివర్ణించారు. "అతను (ఉక్రెయిన్ అధ్యక్షుడు) పసిబిడ్డ నుంచి చాక్లెట్ లాక్కొన్నంత తేలిగ్గా బైడెన్ సర్కారు నుంచి సొమ్ములు తీసుకొన్నారు. ఇక రష్యా విషయంలో అత్యంత కఠినంగా ఉన్న అధ్యక్షుడిని నేను. దాని పైప్‌లైన్ ఆపి ఆంక్షలు విధించాను. జావెలిన్ క్షిపణులు అందజేశాను. కానీ, పుతిన్‌తో కూడా మంచి సంబంధాలున్నాయి. రష్యా విషయంలో నన్ను మించి కఠినంగా ఎవరూ లేరు" అని ట్రంప్ వ్యాఖ్యానించారు. మరోవైపు ఉక్రెయిన్ వీలైనంత తొందరగా యుద్ధం ముగించాలన్న ఒత్తిళ్లు డోజ్ సారథి మస్క్ వైపు నుంచి కూడా పెరిగాయి. తాజాగా తాను స్టార్ లింక్ ఇంటర్నెట్ సేవలను నిలిపేస్తే కీవ్ సేనలు కుప్పకూలుతాయని ఆయన హెచ్చరించారు. అదే సమయంలో ఉక్రెయిన్ ఓటమి అనివార్యమని వ్యాఖ్యానించారు. వాస్తవికతతో ఆలోచించేవారు, అర్థం చేసుకునేవారు ఎవరైనా ఈ యుద్ధాన్ని ఆపాలని కోరుకుంటారని వ్యాఖ్యానించారు. ఆ తర్వాత ట్రంప్ తాజా కామెంట్లు రావడం గమనార్హం. ఇటీవల ఖనిజాల ఒప్పందం కోసం అమెరికాలోని శ్వేతసౌధానికి వచ్చిన జెలెన్‌స్కీ అక్కడ వాగ్వాదం జరగడంతో సంతకాలు చేయకుండానే వెళ్లిపోయారు. ఆ తర్వాత అమెరికా నుంచి కీవ్‌కు సైనిక, ఇంటెలిజెన్స్ సాయాలు నిలిచిపోయాయి. మరోవైపు ఇదే అదునుగా రష్యా దాడులను తీవ్రతరం చేసింది. ఇక ట్రంప్ తొలిసారి అధికారంలో ఉన్న సమయంలో రష్యా గ్యాస్ పైప్‌లైన్‌పై ఆంక్షలు విధించారు. వాస్తవానికి దీనినుంచి ఐరోపాలోని జర్మనీకి గ్యాస్ సరఫరా అవుతుంది.

# ట్రంప్ నివాసం వద్ద భద్రతా వైఫల్యం
## ఆంక్షల వలయంలోకి ప్రైవేటు విమానం

**ఫ్లోరిడా :** అమెరికా అధ్యక్ష భవనం వైట్‌హౌస్ సమీపంలో ఇటీవల ఓ అనుమానితుడి కదలికలు కలకలం సృష్టించిన సంగతి తెలిసిందే. దాంతో అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సిబ్బంది భద్రతను మరింత కట్టుదిట్టం చేశారు. ఈ క్రమంలో తాజాగా మరోసారి భద్రతా వైఫల్యం చోటుచేసుకోవడం గమనార్హం. ఆదివారం (అమెరికా కాలమానం ప్రకారం) ఫ్లోరిడాలోని ట్రంప్ నివాసం సమీపంలో అమల్లో ఉన్న ఆంక్షలు ఉల్లంఘనకు గురైనట్లు తెలుస్తోంది. ఆ భవనం దిశగా ఒక పౌర విమానం దూసుకొచ్చింది. దానిని గమనించిన వైమానిక దళం అడ్డుకుంది. ట్రంప్ తన వెస్ట్ పామ్ బీచ్‌లో గోల్ఫ్ ఆడుతున్నప్పుడు ఈ ఘటన జరిగిందని నార్త్ అమెరికన్ ఏరోస్పేస్ డిఫెన్స్ కమాండ్ ఒక ప్రకటనలో తెలిపింది. ఆంక్షలు ఉన్న ప్రాంతంలోకి వచ్చిన ప్రైవేటు విమానాన్ని ఎఫ్-16 విమానాలు అడ్డుకున్నాయి. శనివారం ఉదయం కూడా ఇలాగే మరో పౌర విమానాన్ని జెట్స్ నిలువరించాయి. ఈ పరిణామాల వేళ ప్రైవేటు విమానాల పైలట్‌లు ఆంక్షలను పట్టించుకోవడం లేదని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇదిలాఉంటే.. వైట్‌హౌస్ సమీపంలో అనుమానితుడి కదలికల గురించి స్థానిక పోలీసులు సీక్రెట్ సర్వీస్‌కు సమాచారం అందించారు. దాంతో అధికారులు అప్రమత్తమయ్యారు. అధ్యక్ష భవనానికి కొంత దూరంలో పార్క్ చేసిన ఒక వాహనాన్ని గుర్తించారు. సమీపంలో ఓ వ్యక్తి నడిచి వెళుతుండగా.. అతడి వద్దకు చేరుకునేందుకు ప్రయత్నించారు. అధికారులు రావడాన్ని గమనించిన అతడు వెంటనే తన వద్ద ఉన్న తుపాకీ బయటకు తీశాడు. అతడిని అదుపులోకి తీసుకునేందుకు ప్రయత్నిస్తుండగా వారి మధ్య ఘర్షణ చోటుచేసుకొంది. అతడు కాల్పులు జరిపేందుకు యత్నిస్తుండగా.. సిబ్బంది నిందితుడిపై కాల్పులు జరిపారు. ఆ సమయంలో అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఫ్లోరిడాలో ఉన్నారు. గాయపడిన నిందితుడిని ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ కేసులో దర్యాప్తు కొనసాగుతోంది.




## కరేబియన్ దేశంలో
# భారత సంతతి విద్యార్థిని మిస్సింగ్

**ప్యూర్టో రికో:** స్నేహితులతో కలిసి కరేబియన్ దేశానికి విహారయాత్రకు వెళ్లిన ఓ భారత సంతతి విద్యార్థిని అక్కడ అదృశ్యమైంది. అమెరికాలోని పిట్స్‌బర్గ్ యూనివర్సిటీలో చదువుతున్న సుదీక్ష కోణంకి.. గతవారం డొమినికన్ రిపబ్లికన్ లోని ఓ బీచ్ వద్ద కన్పించకుండా పోయింది. దీంతో ఆమె కోసం ముమ్మర గాలింపు చేపట్టారు. 20 ఏళ్ల సుదీక్ష కోణంకి వర్జీనియాలో నివాసం ఉంటున్నారు. గతవారం మరో ఐదుగురు అమ్మాయిలతో కలిసి డొమినికన్ రిపబ్లిక్‌లోని ప్రముఖ పర్యటక పట్టణమైన ప్యూంటా కానా ప్రాంతానికి వెకేషన్‌కు వెళ్లారు. మార్చి 6వ తేదీన స్థానికంగా ఉన్న రియూ రిపబ్లికా రిసార్ట్ వద్ద బీచ్ వెంట నడుచుకుంటూ కన్పించింది. ఆ తర్వాత ఆమె తిరిగి రాకపోవడంతో స్నేహితులు పోలీసులను సంప్రదించారు. అప్రమత్తమైన పోలీసులు వెంటనే గాలింపుచర్యలు చేపట్టారు. డ్రోన్లు, హెలికాప్టర్లతో గత నాలుగు రోజులుగా ఆమె కోసం వెతుకుతున్నారు. ఇప్పటివరకు ఏ ఆచూకీ లభించకపోవడంతో బహుశా ఆమె బీచ్‌లో కొట్టుకుపోయి ఉండొచ్చని అనుమానిస్తున్నారు. సముద్రంలో గాలింపు చేపట్టినట్లు తెలిపారు. భారత్‌కు చెందిన సుదీక్ష తల్లిదండ్రులు అమెరికాకు వలస వెళ్లి అక్కడ శాశ్వత నివాస హోదా పొందారు. ప్రస్తుతం పిట్స్‌బర్గ్ యూనివర్సిటీలో గ్రాడ్యుయేషన్ చదువుతోంది.

### జర్మనీ ఎయిర్‌పోర్టుల్లో సమ్మె.. 3400 విమానాలు రద్దు

**బెర్లిన్:** జర్మనీలోని విమానాశ్రయాల్లో పనిచేస్తున్న ఉద్యోగ, కార్మిక సంఘాలు ఒకరోజు సమ్మెకు పిలుపునిచ్చాయి. దీంతో ఫ్రాంక్‌ఫర్ట్, మ్యూనిక్ సహా ప్రధాన నగరాల్లోని ఎయిర్‌పోర్టుల్లో విమాన సర్వీసులపై ప్రభావం పడింది. వేలాది విమాన సర్వీసులు రద్దయ్యాయి. మొత్తంగా 5 లక్షల మంది ప్రయాణికులపై ప్రభావం పడనున్నట్లు అంచనా. ఒక్క ఫ్రాంక్‌ఫర్ట్ ఎయిర్‌పోర్టు నుంచి 1116 విమానాలు రాకపోకలు సాగిస్తుండగా ఇందులో 1054 సర్వీసులు రద్దయినట్లు స్థానిక మీడియా వెల్లడించింది. బెర్లిన్ నుంచి నడిచే విమానాలన్నీ రద్దయ్యాయి. హాంబర్గ్‌లోనూ అదే పరిస్థితి. విమాన సర్వీసులు రద్దైనట్లు కొలోన్ ఎయిర్‌పోర్టు ప్రకటించగా.. సమ్మె కారణంగా విమాన సర్వీసుల సంఖ్య భారీగా తగ్గినట్లు మ్యూనిక్ విమానాశ్రయ అధికారులు ప్రయాణికులకు తెలిపారు. మొత్తంగా 3400 విమాన సర్వీసులు రద్దయ్యే అవకాశం ఉందని జర్మనీ ఎయిర్‌పోర్టు ఆపరేటర్స్ అసోసియేషన్ అంచనా వేసింది. దాదాపు 5లక్షల మంది ప్రయాణికులపై ఇది ప్రభావం చూపనున్నట్లు పేర్కొంది. వేతనాలు పెంచాలని ప్రభుత్వ ఉద్యోగులు డిమాండ్ చేస్తుండగా.. పని ప్రదేశంలో షరతులు సహా అదనపు సమయానికి ఎక్కువ మొత్తంలో బోనస్ ఇవ్వాలని కోరుతూ విమానాశ్రయాల్లో పనిచేసే సిబ్బంది, కార్మికులు డిమాండ్ చేస్తున్నారు. అయితే, వారి డిమాండ్లను పరిష్కరించలేమంటూ ఆయా యాజమాన్యాలు చేతులెత్తేస్తున్నాయి. ఈ క్రమంలో ఇటీవల జరిపిన చర్చలు విఫలం కావడంతో ఉద్యోగ, కార్మిక సంఘాలు ఒకరోజు సమ్మెకు దిగాయి. ఈ నెల చివర్లో మరోసారి చర్చలు జరిగే అవకాశం కనిపిస్తోంది.



## వ్యక్తిగత గణాంకాలను లెక్క చేయడు..

కెరీర్‌లో ఏ బ్యాటర్‌కు సాధ్యం కానివిధంగా మూడు వన్డే డబుల్ సెంచరీలు చేసిన రోహిత్ కెప్టెన్‌గా పూర్తిగా జట్టుకు అంకితమయ్యాడు. ముఖ్యంగా ఐసీసీ టోర్నీల్లో అతడు గణాంకాలను పట్టించుకోకుండా విజయం కోసమే ఆడటం మొదలుపెట్టాడు. ఇన్నింగ్స్ ఓపెనింగ్ చేసి.. ప్రత్యర్థి బౌలర్ల ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీయడం అతడి నైజం. ముఖ్యంగా 2023 వన్డే ప్రపంచకప్‌లో అతడు ఆడిన 11 మ్యాచ్‌ల్లో ఐదుసార్లు 40ల్లో వికెట్ సమర్పించుకొన్నాడు. అయినా.. ఒక శతకం, రెండు అర్ధశతకాలు వచ్చాయంటే ఏ స్థాయిలో ఆడాడో అర్థం చేసుకోవచ్చు. ఆ టోర్నీలో ఏకంగా 597 పరుగులు చేశాడు. ఈ ఛాంపియన్స్ ట్రోఫీ ఫైనల్స్‌లో తన వైఖరికి పూర్తి విరుద్ధంగా 83 బంతుల్లో 76 పరుగులు చేశాడు. ఓపిగ్గా పిచ్‌పై ఎక్కువ సేపు ఉండేందుకు యత్నించాడు. ఇక తాను ఫామ్‌లో లేనని.. బోర్డర్ గావస్కర్ ట్రోఫీలో సిడ్నీ టెస్ట్ నుంచి స్వచ్ఛందంగా వైదొలగి బెంచ్‌పై కూర్చోవడం రోహిత్‌కే చెల్లింది. అదే హిట్‌మ్యాన్ దుబాయ్‌లో జరిగిన ఫైనల్స్‌లో నిలబడి విజయం అందించాడు. వ్యక్తిగత గణాంకాలకు దూరంగా ఉంటూ విజయాలను అందించే విషయంలో మిగిలిన ఆటగాళ్లకు ఆదర్శంగా నిలిచాడు. ఆ తర్వాత నుంచే టీమ్ ఇండియాలో 'సెల్ఫ్‌లెస్' ప్లే వైఖరి మెరుగుపడింది. ఈ సిరీస్‌లో శ్రేయస్, కేఎల్ రాహుల్, అక్షర్, హార్దిక్ బ్యాటింగ్‌ల్లో ఇది స్పష్టంగా కనిపించింది. జట్టులో ఫిట్‌నెస్‌పై ఆసక్తిని మాజీ కెప్టెన్ కోహ్లీ పెంచాడు. అలానే సెల్ఫ్‌లెస్' ఆటను రోహిత్ ముందుకు తీసుకెళ్లాడు.

# ఒత్తిడిలో చెక్కు చెదరడు

## కెప్టెన్సీలో సరికొత్త ప్రమాణాలను పరిచయం చేసిన రోహిత్

- వ్యూహాలపై జట్టుకు స్పష్టత..
- వ్యక్తిగత గణాంకాలను లెక్క చేయని హిట్ మ్యాన్

వ్యూహరచనలో 'షానా'..(తెలివైనవాడు).. ఇది రోహిత్ శర్మ జట్టులోకి వచ్చిన తొలినాళ్లలో అతడికి టీమ్ ఇండియా సీమర్ జహీర్‌ఖాన్ పెట్టిన నిక్‌నేమ్..! వాస్తవానికి ఆటగాడిగా పరిపక్వత చెందేకొద్దీ రోహిత్‌కు ఈ పేరు అతికినట్లు సరిపోతుంది. ఐసీసీ వన్డే ప్రపంచకప్.. టీ20 వరల్డ్‌కప్.. ఛాంపియన్స్ ట్రోఫీ.. మూడు మెగా టోర్నీల్లో కలిపి భారత్‌కు ఒక్కటే ఓటమి..! వరుసగా మూడుసార్లు ఫైనల్స్‌కు చేర్చడమే కాదు.. అందులో రెండుసార్లు జట్టుకు టైటిల్స్‌ను అందించడం అంటే వండరే..! భారత క్రికెట్ కెప్టెన్సీలో సరికొత్త ప్రమాణాలను రోహిత్ పరిచయం చేశాడు.

### వ్యూహాలపై జట్టుకు స్పష్టత..

రోహిత్ శర్మ నాయకత్వంలో వ్యూహాల విషయంలో భారత జట్టు మిగిలిన టీమ్‌లకు అందనంత దూరంలో ఉంది. మైదానంలో ఏం చేయాలి.. బ్యాటింగ్ ఆర్డర్‌లో ఎవరి పాత్ర ఏమిటీ అనే దానిపై సభ్యులకు క్లారిటీ ఉంటుంది. ప్రస్తుత జట్టు బ్యాటింగ్ ఆర్డర్‌లో అక్షర్‌ను పైకి తేవడం.. రాహుల్‌ను ఫినిషర్‌గా దింపడం వంటివి దీనిలో భాగమే. ఈ వ్యూహం పనిచేసి టోర్నీలో రాహుల్ 41లి, 23, 42లి, 34లి అద్భుతమైన ముగింపులను ఇచ్చాడు. రోహిత్ గంటలకొద్దీ ప్రత్యర్థి ఆటగాళ్ల వీడియోలు చూస్తూ గడుపుతాడు. వారి లోపాలు.. బలహీనతల ఆధారంగా తన వ్యూహరచనకు పదును పెట్టుకొంటాడు. కాకపోతే.. తాను చూసింది.. మనసులో అనుకొంది మొత్తం చెప్పి బౌలర్లను గందరగోళానికి గురిచేయకుండా సూటిగా సుత్తి లేకుండా చెప్పడం రోహిత్ స్టైల్.

### ఒత్తిడిలోనూ చెక్కు చెదరడు..

రోహిత్ మైదానంలో ఒత్తిడిని కనిపించనీయడు. జట్టు ఓటమి అంచున ఉన్నా.. గెలుపునకు చివరివరకు ప్రయత్నించడం అతడి స్టైల్. 2018 ఆసియాకప్ ఫైనల్‌లో బంగ్లాదేశ్‌పై చివరి బంతికి జట్టు విజయం సాధించింది. ఇక టీ20 ప్రపంచకప్ ఫైనల్ మ్యాచ్ దీనికి ఉదాహరణ. స్టబ్స్, మిల్లర్, క్లాసన్ నిలకడగా దక్షిణాఫ్రికాను విజయం వైపు నడిపిస్తున్న వేళ హార్దిక్‌ను రంగంలోకి దించి ఫలితం రాబట్టాడు. 15వ ఓవర్ తర్వాత నుంచి మ్యాచ్‌పై పట్టుబిగించి దక్షిణాఫ్రికాను కుప్పకూల్చాడు. ఛాంపియన్స్ ట్రోఫీ ఫైనల్స్‌లో రచిన్–యంగ్ జోడీ బలపడుతున్నవేళ పరిస్థితి చేజారక ముందే.. మిస్టరీ స్పిన్నర్ వరుణ్‌ను రంగంలోకి దించి ఫలితాన్ని రాబట్టాడు. మ్యాచ్ మొత్తంలో స్పిన్నర్లతోనే 38 ఓవర్లు వేయించాడు. ఫలితంగా న్యూజిలాండ్ ఇన్నింగ్స్ చాలా మందకొడిగా సాగింది.

### షమీని జట్టులోకి వద్దని..

రోహిత్ తన సహచరులను సంపూర్ణంగా నమ్ముతాడు. వారిపై వచ్చే విమర్శలు పట్టించుకోడు. దీనికితోడు వారు ఫామ్ విషయంలో ఇబ్బందుల్లో ఉంటే తగినన్ని అవకాశాలు ఇచ్చి వారిలో ఆత్మవిశ్వాసం నింపుతాడు. ముఖ్యంగా గిల్ వంటి యువ ఆటగాడు ఫామ్‌లేమితో ఇబ్బందిపడుతున్నా.. అతడి స్థానాన్ని మార్చలేదు. షమీ వంటి సీనియర్ గాయం నుంచి కోలుకొని బోర్డర్ గావస్కర్‌ట్రోఫీ ఆడేందుకు జట్టులోకి రావాలని యత్నించినా.. రోహిత్ అంగీకరించలేదు. అతడు పూర్తిగా కోలుకోకుండా వచ్చి గాయం తిరగబెట్టడం తనకు ఇష్టం లేదని నిర్మొహమాటంగా చెప్పాడు. ఫలితంగా షమీ పూర్తిగా కోలుకొని ఛాంపియన్స్ ట్రోఫీ ఆడి విజేతగా నిలవగలిగాడు. ఇక ఒక సారి వెటరన్ స్పిన్నర్ అశ్విన్ మ్యాచ్ కోసం రాజ్‌కోట్‌లో ఉండగా అతడి తల్లి అనారోగ్యం పాలైంది. ఈ విషయం తెలిసిన రోహిత్ యాష్ కోసం ప్రత్యేక విమానం ఏర్పాటుచేయించి చెన్నై పంపించాడు. అతడికి ధైర్యం చెప్పేందుకు జట్టు ఫిజియో కమలేష్‌ను కూడా వెళ్లమని సూచించాడు. అంతలా జట్టు సభ్యులను చూసుకొనే కెప్టెన్‌ను నేను చూడలేదని అశ్వినే స్వయంగా చెప్పాడు.



## ఛాంపియన్స్ ట్రోఫీ ఫైనల్..

### వ్యూస్‌లోనూ రికార్డులు బద్దలు

ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ విజేతగా టీమ్‌ఇండియా నిలిచింది. న్యూజిలాండ్‌తో జరిగిన పోరులో భారత్ విక్టరీ సాధించిన సంగతి తెలిసిందే. అయితే, ఈ ఫైనల్ పోరు రికార్డులను కొల్లగొట్టింది. వ్యూస్ పరంగా అత్యధికమంది చూసిన మ్యాచ్‌గా ఘనత సాధించింది. ఇప్పటివరకు ఐసీసీ ట్రోఫీలకు సంబంధించి ఫైనల్ మ్యాచ్‌లకు వచ్చిన వ్యూస్ కంటే దాదాపు 15 రెట్లు ఈసారి ఛాంపియన్స్ ట్రోఫీ ఫైనల్‌ను వీక్షించడం గమనార్హం. దుబాయ్ వేదికగా జరిగిన ఫైనల్‌కు 90 కోట్లకు పైగా వ్యూస్ వచ్చినట్లు వార్తలు వస్తున్నాయి. ఏకకాలంలో 6.1 కోట్ల మంది చూసినట్లు తెలుస్తోంది. గత వన్డే ప్రపంచకప్ ఫైనల్‌ను 5.9 కోట్ల వ్యూవర్స్ వీక్షించారు. ఇక ఛాంపియన్స్ ట్రోఫీలో భారత్ – పాకిస్థాన్ మ్యాచ్‌కు 60 కోట్ల వీక్షణలు వచ్చాయి.

## ఐపీఎల్‌లో పొగాకు, మద్యం ప్రకటనలు వద్దు : కేంద్రం




ఇండియన్ ప్రీమియర్ లీగ్‌లో పొగాకు, మద్యం ప్రకటనలను నిషేధించాలని కేంద్రం ఆదేశించింది. ఈమేరకు ఐపీఎల్ ఛైర్మన్ అరుణ్ ధుమాల్‌కు కేంద్ర ఆరోగ్యశాఖ లేఖ రాసింది. మార్చి 22 నుంచి ఈ లీగ్ ప్రారంభం కానున్న సంగతి తెలిసిందే. "భారత యువతకు ఆదర్శంగా ఉండే క్రికెట్ ఆటగాళ్లకు ఏ రకమైన పొగాకు లేక మద్యం ప్రకటనలతో సంబంధం ఉండకూడదు. ఐపీఎల్, సంబంధిత కార్యక్రమాలు జరిగే స్టేడియం ప్రాంగణాలు, జాతీయ మీడియాలో ప్రసారమయ్యే సెషన్‌ల సమయంలో పొగాకు, మద్యం ప్రకటనలు ఇవ్వొద్దు. అమ్మకాలపై కూడా నిషేధం ఉంది. ఈ నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలి" అని కేంద్రం ఆదేశించింది. మార్చి 22 నుంచి మే 25 వరకు ఐపీఎల్ 2025 సీజన్ అలరించనుంది. మొత్తం 74 మ్యాచులు 65 రోజులపాటు జరుగుతాయి. తొలి మ్యాచ్ మార్చి 22న డిఫెండింగ్ ఛాంపియన్ కోల్‌కతా నైట్‌రైడర్స్ – రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్ల మధ్య ఈడెన్ గార్డెన్స్ వేదికగా ప్రారంభం కానుంది. మార్చి 23న ఉప్పల్ వేదికగా హైదరాబాద్ – రాజస్థాన్ జట్ల మధ్య పోరు ఉండనుంది. ఈ సమయంలో క్రికెట్ అభిమానులు టీవీలు, మొబైళ్లను వదలరు. దాంతో ఐపీఎల్‌పై అడ్వర్టైజర్లు ఎక్కువ దృష్టిపెడుతుంటారు. ఈనేపథ్యంలోనే కేంద్రం నుంచి స్పందన వచ్చింది. "ప్రతి ఏడాది భారత్‌లో సంభవిస్తోన్న 70 శాతం మరణాలకు దీర్ఘకాలిక వ్యాధులైన క్యాన్సర్, ఊపిరితిత్తుల సంబధిత వ్యాధులు, హైపర్‌టెన్షన్, మధుమేహం కారణమవుతున్నాయి. పొగాకు, ఆల్కహాల్ వాడకం ఈ దీర్ఘకాలిక వ్యాధులకు దారితీస్తున్నాయి. పొగాకు సంబంధిత మరణాల్లో భారత్ రెండో స్థానంలో ఉంది" అని కేంద్రం పేర్కొంది.

## 'ఎక్స్' సేవలకు ప్రపంచవ్యాప్తంగా అంతరాయం



ప్రముఖ మైక్రో బ్లాగింగ్ సైట్ 'ఎక్స్ (గతంలో ట్విటర్)' సేవలకు కాసేపు అంతరా యం ఏర్పడింది. భారత్ సహా ప్రపంచవ్యాప్తంగా పలు ప్రాంతాల్లో సోమవారం మధ్యా హ్నం ఈ సమస్య తలెత్తింది. 'ఎక్స్' ఖాతాలను తెరవగానే ఖాళీ పేజీ దర్శనమిస్తోందని పలువురు యూజర్లు ఇతర సామాజిక మాధ్యమాల వేదిక గా ఫిర్యాదులు చేశారు. డౌన్‌డిటెక్టర్ పోర్టల్ ప్రకారం.. భారత్‌లో దాదాపు 2 వేలకు పైగా ఫిర్యాదులు వచ్చినట్లు తెలుస్తోంది. అమెరికాలో 18 వేల మంది, యూకేలో 10వేల మంది 'ఎక్స్' సేవలు రావట్లేదని పోస్టులు చేసినట్లు సమాచారం. అమెరికాలో దాదాపు 57 శాతం మందికి ఈ సమస్య ఎదురైనట్లు పలు ఆంగ్ల మీడియా కథనాలు వెల్లడిస్తున్నాయి. దీనిపై కంపెనీ స్పందించలేదు. సిబ్బంది కొరత, ఇతర సాంకేతిక కారణాల వల్ల తరచూ ఆ మధ్య 'ఎక్స్' సేవలు తరచూ నిలిచిపోయిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం ఎక్స్ సేవలు తిరిగి అందుబాటులోకి వచ్చాయి.



## ఏసీల ధరలు 4-5% పెరిగే అవకాశం

దేశవ్యాప్తంగా అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్న నేపథ్యంలో, ఎయిర్ కండీషనర్ల (ఏసీ)కు గిరాకీ గణనీయంగా పెరుగుతుందని కంపెనీలు అంచనా వేస్తున్నాయి. వేసవి ఎండలు ముదిరే కొద్దీ, రాబోయే రోజుల్లో అమ్మకాలు 25–30% పెరుగుతాయనే భావనతో కంపెనీలు ఏసీలను తయారీని పెంచుతున్నాయి. ఇందుకు తగ్గట్లుగా విడిభాగాలు సరఫరా కావడంలేదు. ఫలితంగా ధరలు అధికమవుతున్నాయి. మొత్తంమీద ఏసీ తయారీ వ్యయం పెరిగి, వీటి ధరలను కంపెనీలు 4–5% పెంచొచ్చనే అభిప్రాయాలు వెలువడుతున్నాయి. కొనుగోలుదారుకు వచ్చేసరికి ఈ భారం రూ.1500–2000 వరకు ఉండొచ్చని చెబుతున్నారు.

# నష్టాల్లో ముగిసిన సూచీలు

### 22,500 దిగువకు నిఫ్టీ




**ముంబయి:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు నష్టాల్లో ముగిశాయి. ఉదయం లాభాల్లో కదలాడిన సూచీలు మధ్యాహ్నం తర్వాత నష్టాల్లోకి జారుకున్నాయి. అమెరికా ఫ్యూచర్స్ నుంచి వచ్చిన ప్రతికూల సంకేతాలతో మదుపర్లు ఆఖర్లో అమ్మకాలకు దిగారు. దీంతో ఇంట్రాడే గరిష్ఠాల నుంచి సెన్సెక్స్ 700 పాయింట్ల మేర పతనం కాగా.. నిఫ్టీ 22,500 దిగువకు చేరింది. ఇన్ఫోసిస్, హిందుస్థాన్ యూనిలీవర్, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్ షేర్లు సూచీలకు దన్నుగా నిలవగా.. ఎల్‌అండ్‌టీ, రిలయన్స్ ఇండస్ట్రీస్ సూచీలను దిగువకు లాగాయి. మిడ్‌క్యాప్, స్మాల్ క్యాప్ షేర్లలోనూ అమ్మకాల ఒత్తిడి కనిపించింది. సెన్సెక్స్ ఉదయం 74,474.98 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 74,332.58) లాభాల్లో ప్రారంభమైంది. ఉదయమంతా లాభాల్లో కదలాడింది. ఇంట్రాడేలో 74,741.25 వద్ద గరిష్ఠాన్ని తాకిన సూచీ.. మధ్యాహ్నం తర్వాత నష్టాల్లోకి జారుకుంది. ఇంట్రాడేలో 74,022.24 వద్ద కనిష్ఠాన్ని తాకిన సూచీ.. చివరికి 217.41 పాయింట్ల నష్టంతో 74,115.17 వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం 77.55 పాయింట్ల నష్టంతో 22,474.95 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 38 క్షీణించి 87.33గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో ఇండస్ ఇండ్ బ్యాంక్, జొమాటో, ఎల్‌అండ్‌టీ, టైటాన్, మహీంద్రా అండ్ మహీంద్రా షేర్లు నష్టాల్లో ముగిశాయి. పవర్‌గ్రిడ్ కార్పొరేషన్, హిందుస్థాన్ యూనిలీవర్, ఇన్ఫోసిస్, నెస్లే ఇండియా, ఏషియన్ పెయింట్స్ షేర్లు లాభపడ్డాయి. అంతర్జాతీయంగా బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 70.51 డాలర్ల వద్ద ట్రేడవుతుండగా.. బంగారం ఔన్సు 2914 డాలర్ల వద్ద కొనసాగుతోంది.

## 100 మెగావాట్ల సౌర విద్యుత్ ప్లాంట్ ప్రారంభం

ప్రముఖ పునరుత్పాదక ఇంధన సంస్థ 'జునిపర్ గ్రీన్ ఎనర్జీ'..భూటాన్‌కు విద్యుత్ సరఫరా చేయడానికి రాజస్థాన్‌లో 100 మెగావాట్ల సౌర విద్యుత్ ప్రాజెక్టును ప్రారంభించినట్లు ఈ రోజు(సోమవారం) ప్రకటించింది. శీతాకాలం భూటాన్‌కు సరఫరా అయ్యే విద్యుత్‌లో 50 శాతం అందించే లక్ష్యంతో ఈ ప్రాజెక్టు పనిచేస్తుందని జునిపర్ ఒక ప్రకటనలో తెలిపింది. జునిపర్ గ్రీన్ ఎనర్జీ..సౌర, పవన, హైబ్రిడ్ ప్రాజెక్టుల్లో ప్రత్యేకత కలిగిన స్వతంత్ర పునరుత్పాదక ఇంధన విద్యుత్ ఉత్పత్తి సంస్థ. ఇది సింగపూర్‌కు చెందిన ఏటీ గ్రూప్‌లో భాగం. జునిపర్ గ్రీన్ ఎనర్జీ..పునరుత్పాదక ఇంధనం, నివాస, వాణిజ్య స్థిరాస్తి, హాస్పిటాలిటీలో ప్రపంచ స్థాయి పెట్టుబడులను కలిగి ఉంది. ఈ సంస్థను 2018, అక్టోబర్‌లో స్థాపించారు.






## ఎస్ఎంఈ ఐపీఓ నిబంధనలు కఠినతరం

### ఆఫర్ ఫర్ సేల్ 20 శాతమే

స్టాక్ మార్కెట్‌లో నిధుల సమీకరణ కోసం క్యూకడుతున్న స్మాల్ మీడియం ఎంటర్‌ప్రైజెస్ ఐపీఓలకు చెక్ పెట్టేందుకు మార్కెట్ నియంత్రణ సంస్థ సెబీ నడుం బిగించింది. పబ్లిక్ ఇష్యూకు వచ్చేందుకు కొన్ని నిబంధనలను నిర్దేశించింది. లాభదాయకత, 20 శాతానికి మించని ఆఫర్ ఫర్ సేల్ వంటి పరిమితులను పెట్టింది. రిటైల్ ఇన్వెస్టర్ల ప్రయోజనాలను కాపాడే ఉద్దేశంతో సెబీ ఈ నిబంధనలను తీసుకొచ్చింది. ఇటీవల కాలంలో ఎస్ఎంఈ ఐపీఓల్లో పెట్టుబడులకు ఇన్వెస్టర్లు ఉత్సుకత చూపిస్తున్న వేళ సెబీ ఈ నిబంధనలను కట్టుదిట్టం చేస్తూ తాజాగా ఓ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఎస్ఎంఈ విభాగంలో ఏదైనా కంపెనీ ఐపీఓకు రావాలంటే గడిచిన మూడేళ్లలో కనీసం రెండేళ్ల పాటు రూ.1 కోటి నిర్వహణ లాభాలను సాధించి ఉండాలి. ఈ ఐపీఓల్లో ఆఫర్ ఫర్ సేల్ ద్వారా షేర్ హోల్డర్లు 20 శాతానికి మించి వాటాను విక్రయించడానికి వీల్లేదు. ప్రస్తుత వాటాదారులెవరూ 50 శాతానికి మించి వాటాను విక్రయించడానికి అవకాశం లేదు. కనీస వాటా పరిమితికి మించి అదనంగా ఉన్న షేర్ హోల్డింగ్‌కు లాక్–ఇన్ వ్యవధి ఉంటుంది. ఏడాది తర్వాత అదనంగా ఉన్న వాటాబీ రెండేళ్ల తర్వాత మిగిలిన 50 శాతం వాటా వదులుకోవడానికి వీలవుతుంది. నాన్ ఇన్‌స్టిట్యూషనల్ ఇన్వెస్టర్లకు షేర్ల అలకేషన్‌కు సంబంధించి మెయిన్ బోర్డు ఐపీఓ నిబంధనలే ఎస్ఎంఈ ఐపీఓలకూ వర్తిస్తాయి. ఎస్ఎంఈ ఐపీఓల సబ్‌స్క్రిప్షన్‌కు కనీసం రెండు లాట్లు కొనగోలు చేయాల్సి ఉంటుంది. పబ్లిక్ ఇష్యూ ద్వారా సమీకరించిన నిధులను సాధారణ కార్పొరేట్ అవసరాలు పేరు చెప్పి ఎడాపెడా వినియోగించుకోవడానికి లేదు. మొత్తం నిధుల్లో 15 శాతం లేదా రూ.10 కోట్లు మాత్రమే (ఏది తక్కువైతే అది) గరిష్ఠంగా వినియోగించుకోవడానికి వీలుంది. ప్రమోటర్లు, ప్రమోటర్ గ్రూప్స్, సంబంధిత పార్టీలు ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా తీసుకున్న రుణాలకు ఐపీఓ ద్వారా సమీకరించిన నిధులను వినియోగించడానికి వీల్లేదు.

# ‘రాజాసాబ్’లో నాది ఆ పాత్ర కాదు..

## క్లారిటీ ఇచ్చిన నిధి అగర్వాల్

ఇద్దరు అగ్ర హీరోల సినిమాల్లో నటిస్తూ ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమయ్యారు నటి నిధి అగర్వాల్. టాలీవుడ్ స్టార్ హీరోలు పవన్ కల్యాణ్, ప్రభాస్‌ల సరసన భారీ ప్రాజెక్ట్‌లతో అందరి దృష్టిని ఆకర్షిస్తున్నారు. తాజాగా ఆమె ఓ ఆంగ్ల మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ‘రాజాసాబ్’లో తన పాత్ర గురించి వివరించారు. అలాగే పవన్‌తో కలిసి నటించడం ఎంతో ఆనందంగా ఉందని తెలిపారు. “ఇండస్ట్రీకి రావడం కోసమే మోడలింగ్ రంగంలోకి వెళ్లాను. సినీ నేపథ్యం లేకపోవడంతో మోడలింగ్ ద్వారా ఇండస్ట్రీకి వచ్చాను. ప్రస్తుతం టాలీవుడ్‌లో చేస్తోన్న రెండూ భారీ ప్రాజెక్ట్‌లే. పవన్ కల్యాణ్ ‘హరి హర వీరమల్లు’ పీరియాడిక్ యాక్షన్ డ్రామాగా రానుంది. ఈ సినిమా కోసం నేను రెండున్నర నెలలు గుర్రపుస్వారీ నేర్చుకున్నాను. భరతనాట్యం, కథక్‌లోనూ శిక్షణ తీసుకున్నాను. పవన్‌తో కలిసి నటించడం ఎప్పటికీ మర్చిపోలేని అనుభవం. ఆయన గొప్ప మేధావి. సాహిత్యంపై పట్టు ఉంది. ఆయన ధైర్యాన్ని అభినందించాలి. డిప్యూటీ సీఎం కాకముందు నుంచే ఈ సినిమా షూటింగ్ ప్రారంభమైంది. ఆ తర్వాత ఆయన ఎన్నికల సమయంలో బిజీగా ఉండడంతో కొన్ని రోజులు చిత్రీకరణ వాయిదా వేశాం. డిప్యూటీ సీఎం అయ్యాక మళ్లీ షూటింగ్‌లో పాల్గొన్నారు. అప్పటికీ, ఇప్పటికీ అలానే ఉన్నారు. కొంచెం కూడా మార్పులేదు” అన్నారు. ఇక ప్రభాస్ ‘రాజా సాబ్’ గురించి మాట్లాడుతూ.. “హారర్ కామెడీ నేపథ్యంలో రానున్న ఈ చిత్రంలో నేను దెయ్యం పాత్ర పోషించడం లేదని స్పష్టం చేస్తున్నాను. వినోదాత్మకంగా సాగే ఈ సినిమాలో నా పాత్ర అందరినీ ఆశ్చర్యపరిచేలా ఉంటుంది. ప్రభాస్ ఎప్పుడూ నవ్విస్తూ ఉంటారు. సెట్‌లో అందరితో సరదాగా ఉంటారు” అని చెప్పారు.



## సినిమాలో అవకాశాలు తగ్గాయి

### యాడ్స్‌తోనే సంపాదిస్తున్నా : ప్రకాష్‌వారియర్

నటనపై ఆసక్తితో సినీరంగంలోకి అడుగుపెట్టింది. షార్ట్ ఫిల్మ్స్ ద్వారా ఫేమస్ అయ్యింది. తర్వాత సినీరంగంలోకి నటిగా ఎంట్రీ ఇచ్చింది. కథానాయికగా ఆమె నటించిన ఫస్ట్ మూవీ సంచలన విజయం సాధించింది. ముఖ్యంగా అందులో ఆమె కనిపించిన సీన్స్ సోషల్ మీడియాలో ఓ రేంజ్ లో దూసుకుపోయాయి. కట్ చేస్తే.. స్టార్ హీరోయిన్‌గా క్రేజ్ సొంతం చేసుకుంది. కానీ అం దం, అభినయం కట్టిపడేసిన ఈ బ్యూటీకి అదృష్టం మాత్రం కలిసిరావడం లేదు. ఆమె నటించిన చిత్రాలు డిజాస్టర్స్ కావడంతో నెమ్మదిగా అవకాశాలు తగ్గిపోయాయి. కానీ సోషల్ మీడియాలో గ్లామర్ ఫోజులతో మెంటలెక్కిస్తోంది. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఆ బ్యూటీ మాట్లాడుతూ.. తనకు ఎవరూ అవకాశాలు ఇవ్వడం లేదని.. కానీ తాను మాత్రం సోషల్ మీడియా పేజీల ద్వారా ఆదాయం సంపాదిస్తున్నానని తెలిపింది హీరోయిన్ ప్రియా ప్రకాష్ వారియర్. ఒకే ఒక్క సినిమాతో మలయాళీ ప్రేక్షకుల హృదయాలను దోచుకున్న నటి ప్రియా ప్రకాష్ వారియర్. ఒమర్ లులు దర్శకత్వం వహించిన ఒరు అదార్ లవ్ చిత్రంలోని ఒక పాటలో కన్నుగీటుతూ కనిపించి ఒక్కసారిగా ఫేమస్ అయ్యింది. ఆ తర్వాత నెట్టింట తెగ ట్రెండ్ అయ్యింది. అలాగే మలయాళంలో వరుస ఆఫర్స్ అందుకుంది. ఒక్క రోజులోనే లక్షలాది మంది ఆ నటిని ఇన్‌స్టాగ్రామ్‌లో ఫాలో అయ్యారు. ఇన్‌స్టాగ్రామ్ ద్వారా ప్రకటనలు, ప్రమోషన్ ద్వారా దృష్టిని ఆకర్షించింది. దీనివల్ల స్టార్‌కు మంచి ఆదాయం వచ్చింది. ఈ విషయాన్ని ఆ స్టార్ స్వయంగా బహిరంగంగా చెప్పడంతో ఇప్పుడు అది సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. సినిమా లేకపోయినా బ్రాండ్ల నుండి ప్రకటనలు వస్తున్నందుకు ఉపశమనం కలిగిస్తోందని తెలిపింది. కానీ తన లక్ష్యం మాత్రం సినిమాల్లో నటించడమే అని తెలిపింది.



## రూ.18 కోట్లు ఆఫర్..

### ‘అవతార్’లో అవకాశం కావాలనే వదులుకున్నా : నటుడు గోవింద

ప్రపంచ సినీ పరిశ్రమలో ‘అవతార్’ ఓ సంచలనం. హాలీవుడ్ దర్శకుడు జేమ్స్ కామెరూన్ సృష్టించిన ఓ అద్భుత ప్రపంచం ఈ చిత్రాలు. ఇలాంటి గొప్ప సినిమాలో అవకాశం ఇస్తానంటే ఎవరైనా వద్దంటారా.. బాలీవుడ్ నటుడు గోవింద ‘అవతార్’ అవకాశాన్ని తిరస్కరించారట. తాజాగా ఓ ఇంటర్వ్యూలో ఆయన చెప్పిన విషయాలు విని అందరూ ఆశ్చర్యపోయారు. “అమెరికాలో ఉన్న సర్దార్‌కు నేను బిజినెస్ ఐడియా ఇచ్చాను. అది బాగా పాపులర్ కావడంతో అతడు నన్ను జేమ్స్ కామెరూన్ దగ్గరకు తీసుకెళ్లాడు. ఆ దిగ్గజ దర్శకుడితో నేను డిన్నర్ చేశాను. అప్పుడే ఆయన నాకు ‘అవతార్’లో అవకాశం గురించి వివరించారు. ఈ సినిమాలో కీలకమైన ‘స్పైడర్’ పాత్రలో నటిస్తావా అని అడిగారు. రూ.18 కోట్లు పారితోషికం ఇస్తామని అన్నారు. 410 రోజులు షూటింగ్ ఉంటుందన్నారు. ఓకే అన్నాను, కానీ, శరీరానికి పెయింట్ వేసుకోవాల్సి వస్తుందన్నారు. దీంతో ఆ ఆఫర్‌ను తిరస్కరించాను. ‘మీ రూ.18 కోట్లు నాకు వద్దు. శరీరానికి అలా పెయింట్ వేసుకుంటే నేను ఆసుపత్రిలో చేరాల్సి వస్తుంది’ అని వాళ్లతో చెప్పేశాను. తర్వాత ఆ పాత్రలో నటించిన నటుడిని చూసి ఆశ్చర్యపోయాను. అంత గొప్పగా నటించాడు” అని గోవింద చెప్పారు. ప్రస్తుతం గోవింద కామెంట్స్ వైరల్‌గా మారాయి. ఇక 2009, 2022ల్లో రెండు భాగాలుగా ఆకట్టుకున్న ‘అవతార్’ ప్రస్తుతం మూడో పార్ట్ సిద్ధమవుతోంది. ఈ ఏడాది డిసెంబర్ 19న ‘అవతార్– ఫైర్ అండ్ యాష్’ పేరుతో ఇది విడుదల కానుంది. అవతార్ ఫ్రాంచైజీలో రానున్న ‘అవతార్ 4’ 2029లో, చివరిగా రానున్న ‘అవతార్ 5’ డిసెంబరు 2031లో విడుదల చేయనున్నట్లు చిత్రబృందం గతంలో తెలిపింది.



## ఎన్నో చెత్త సినిమాలకంటే ‘కంగువా’ బెటర్



సూర్య కథానాయకుడిగా శివ దర్శకత్వంలో వచ్చిన పీరియాడిక్ యాక్షన్ థ్రిల్లర్ ‘కంగువా’ గతేడాది విడుదలైన ఈ మూవీ బాక్సాఫీస్ వద్ద ఆశించిన విజయాన్ని అందుకోలేదు. అయితే, ఈ మూవీకి వచ్చిన రివ్యూలపై నటి, సూర్య సతీమణి జ్యోతిక స్పందించారు. ఎన్నో దారుణమైన సినిమాలకంటే ‘కంగువా’ బెటర్ అని అభిప్రాయపడ్డారు. “దక్షిణాదిలో చాలా చెత్త సినిమాలు కమర్షియల్‌గా విజయం సాధించి వసూళ్లు సాధించిన సందర్భాలు ఉన్నాయి. నా భర్త నటించిన ‘కంగువా’ విషయంలో సమీక్షలు మరీ దారుణంగా రాశారు. ఏమాత్రం విచక్షణ లేకుండా రివ్యూలు రాశారనిపించింది. సినిమా ఆరంభంలో కొద్దిసేపు ప్రేక్షకులకు కనెక్ట్ కాలేదు. అలాగే కొన్ని చోట్ల సన్నివేశాలు ఆశించిన స్థాయిని అందుకోలేకపోయి ఉండవచ్చు. కానీ, అది చేయడానికి టీమ్ ఎంతో కష్టపడింది. ‘కంగువా’ను వైవిధ్య చిత్రంగా తీర్చిదిద్దింది. కానీ, మీడియా వ్యవహరించిన తీరు న్యాయంగా లేదు” అని ఓ టాక్ షోలో అన్నారు. ఇటీవల ‘డబ్బా కార్టెల్’ వెబ్‌సిరీస్‌తో ప్రేక్షకులను పలకరించారు జ్యోతిక. సూర్య ‘కంగువా’ పై ఆమె గతంలోనూ ఇలాగే స్పందించారు. సినిమాలో మొదటి అరగంట వర్క్ అవుట్ కాలేదని, సౌండ్‌లో కూడా కాస్త సమస్యలు ఉన్నాయని ఇన్‌స్టా వేదికగా పోస్ట్ పెట్టారు. ఇలాంటి లోపాలు భారతీయ సినిమాల్లో తరచూ కనపడుతూ ఉంటాయన్నారు. ముఖ్యంగా సరికొత్త నేపథ్యంతో సినిమాలు చేయాలని ప్రయత్నించినప్పుడు ఇలాంటివి జరుగుతాయన్నారు.

## నందినీరెడ్డితో మరోసారి సమంత



స్టార్ హీరోయిన్ సమంత, లేడీ డైరెక్టర్ నందిని రెడ్డి  ది హిట్ కాంబినేషన్. కృష్ణవంశీతో పాటు పలువురి దగ్గర దర్శకత్వ శాఖలో పనిచేసిన నందినీ రెడ్డి ఆ తర్వాత దర్శకురాలిగా మారి పలు విజయవంతమైన చిత్రాలను రూపొందించారు. ‘అలా మొదలైంది’తో దర్శకురాలిగా కెరీర్ ప్రారంభించిన నందినీ రెడ్డి స్టార్స్ వెనక పడకుండా, కథకు ప్రాధాన్యమిచ్చి సినిమాలు చేస్తూ ముందుకు సాగుతున్నారు. సిద్ధార్థ్, సమంత జంటగా గతంలో ‘జబర్ దస్త్’ మూవీని తెరకెక్కించారు నందినీరెడ్డి. ఆ సినిమా పెద్దంతగా ఆడలేదు. అయితే ఆ తర్వాత వచ్చిన ‘ఓ బేబీ’ ఘన విజయం సాధించింది. అంతేకాదు... నటీమణులు లక్ష్మి, సమంతలకు, నాగశౌర్య, తేజ సజ్జా, రావు రమేశ్‌లకు మంచి పేరునూ తెచ్చిపెట్టింది. ఇప్పుడు మరోసారి సమంత నాయికగా తానో సినిమా చేయబోతున్నానని నందినీ రెడ్డి తెలిపింది. నాగచైతన్య నుండి విడిపోయిన తర్వాత కొంతకాలం ఆరోగ్యంపై దృష్టిపెట్టిన సమంత నిదానంగా కోలుకుంది. వెబ్ సిరీస్ లతో జాతీయ స్థాయిలో పేరు తెచ్చుకుంటూనే సొంత నిర్మాణ సంస్థనూ స్థాపించింది. తన సొంతబ్యానర్ లో ‘మా ఇంటి బంగారం’ అనే సినిమాను సమంత నిర్మిస్తోంది. ఇవాళ మహిళలకు చిత్రసీమలో తగిన ప్రాధాన్యం లేదనేది వాస్తవం. అలానే వేతనాల విషయంలోనూ ఎంతో వ్యత్యాసం ఉంది. ఇలాంటి వాటికి తావు ఇవ్వకుండా సమంత తన సొంత చిత్రంలో అందరికీ సమానవేతం, గౌరవం అందిస్తోందని నందినీ రెడ్డి తెలిపింది. ఈ సినిమా తర్వాత తాను సమంతతో ఓ సినిమా చేయబోతున్నానని వెల్లడించింది. అయితే అది సమంత ఓన్ బ్యానర్ లో ఉంటుందా? లేకపోతే... వేరే నిర్మాణ సంస్థ వీరితో మూవీ చేస్తుందా? అనేది తెలియాల్సి ఉంది.

## ఒకప్పుడు రూ. 2500 కోసం డ్యాన్స్ చేసిన బ్యూటీ

కోలీవుడ్ ఇండస్ట్రీ తండ్రి స్టార్ హీరో. ఇప్పటివరకు అనేక చిత్రాల్లో నటించి తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నాడు. తండ్రి బాటలోనే సినీప్రయాణం స్టార్ట్ చేసింది కూతురు. కథానాయికగా సినీరంగంలోకి అడుగుపెట్టింది. మొదటి సినిమాతోనే నటిగా ప్రశంసలు అందుకుంది. కానీ ఆ తర్వాత ఊహించని విధంగా పవల్ ఫుల్ విలన్‌గా మారి సత్తా చాటుతుంది. ప్రస్తుతం కోట్లాకు యజమానిగా మారిన ఆమె.. ఒకప్పుడు రూ.2500 కోసం రోడ్డుపై డ్యాన్స్ చేసింది. ఇంతకీ ఆమె ఎవరో తెలుసా.. తమిళ్ స్టార్ బ్యూటీ వరలక్ష్మి శరత్ కుమార్. స్టార్ హీరో శరత్ కుమార్ కూతురే ఆమె. తండ్రి సపోర్ట్ లేకుండానే సినీ పరిశ్రమలోకి అడుగుపెట్టి సెపరేట్ ఫ్యాన్ ఫాలోయింగ్ సంపాదించుకుంది. నయనతార భర్త విఘ్నేశ్ దర్శకత్వం వహించిన పోడా పోడి సినిమాతో కథానాయికగా ఎంట్రీ ఇచ్చింది వరలక్ష్మి శరత్ కుమార్. ఆ తర్వాత తమిళంలో పలు చిత్రాల్లో నటించి మెప్పించింది. అయితే నటిగా ప్రశంసలు అందుకున్నప్పటికీ ఆఫర్స్ మాత్రం రాలేదు. దీంతో కొన్నాళ్లు సైలెంట్ అయిన ఆమె.. తర్వాత విలన్ పాత్రతో రీఎంట్రీ ఇచ్చింది. ముఖ్యంగా తెలుగులో విలన్ పాత్రలతోనే ఫేమస్ అయ్యింది. తెలుగు,తమిళం, మలయాళం, కన్నడ భాషలలో నటిస్తూ ఫుల్ బిజీగా ఉంటుంది. డేరింగ్ నటిగా పేరు సంపాదించుకుంది. ఇటీవలే తన స్నేహితుడు నికోలాయ్ సచ్ దేవ్ ను ప్రేమించి పెద్దల సమక్షంలో పెళ్లి చేసుకుంది. ఇదిలా ఉంటే.. ఇటీవల ఓ డ్యాన్స్ షోలో తన భర్తతో కలిసి పాల్గొంది వరలక్ష్మి. ఆ షోలో ముగ్గురు పిల్లల తల్లి డ్యాన్స్ చేయడం చూసి ఆశ్చర్యపోయింది. ఈ క్రమంలోనే ఆమె మాట్లుడుతూ.. తాను ఇప్పటివరకు ఎవరికీ చెప్పని రహస్యాన్ని చెబుతానని తెలిపింది. గతంలో తాను రోడ్డుపైనే డ్యాన్స్ చేసిన సందర్భాలు ఉన్నాయని తెలిపింది. రూ.2500 కోసం ఫస్ట్ టైం ఓ షో కోసం రోడ్డు మీద డ్యాన్స్ చేశానని తెలిపింది. రోడ్స్ మీద డ్యాన్స్ చేయడం ఎవరూ తప్పుగా భావించవద్దని తెలిపింది.



Editor, Publisher & Owner by Reddy Shekar,3-184, venkatapur, (m) venkatapur, mulugu dist, 506352, Printed at 16-48 SS Printers, (m) mulugu, mulugu. RNI No. TELTEL/2021/86151, E Mail : teenmaardesk@gmail.com, Cell :  9966847463